శనివారం
09-12-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 167
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

స్టూడెంట్ డిపాజిట్ పెంచేసిన కెనడా

ఒట్టావా: కెనడలో ఉన్నత విద్యను అభ్యసించాలనే అంతర్జాతీయ విద్యార్థులపై భారం పెరగనుంది. నిబంధనలను కఠినతరం చేస్తూ స్టడీ పర్మిట్ కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థుల ఆర్థిక సంసిద్ధతను పెంచేలా అక్కడి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. స్టూడెంట్ డిపాజిట్‌ను 10,000 డాలర్ల నుంచి 20,635 డాలర్లకు పెంచుతున్నట్లు ప్రకటించింది. జనవరి 1 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది.
ఆర్థిక బలహీనత, దోపిడీ నుంచి అంతర్జాతీయ విద్యార్థులను తాజా నిర్ణయాలు రక్షిస్తాయని కెనడా ఇమ్మిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ పేర్కొన్నారు.

మహువాపై బహిష్కరణ వేటు

నైతిక విలువల కమిటీ నివేదికకు లోక్‌సభ ఆమోదం

- విపక్షాల తీవ్ర నిరసన
- పట్టించుకోని స్పీకర్, బీజేపీ
- మహాభారతాన్ని చూస్తారు: మహువా

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాపై బీజేపీ పంతం నెగ్గించుకుంది. మొయిత్రాపై బహిష్కరణ వేటు వేయించింది. దీనిపై విపక్షాలు తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చగా అధికార బీజేపీ మాత్రం నిస్సిగ్గుగా సమర్థించుకుంది. పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగినందుకు డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ మహువా మొయిత్రాపై బహిష్కరణ వేటు పడింది. ఈ వ్యవహారంపై పార్లమెంట్ నైతిక విలువల కమిటీ ఇచ్చిన నివేదికను లోక్‌సభ శుక్రవారం ఆమోదించింది. ఎంపీ మహువా అనైతికంగా,

- మిగతా 2 లో

బీజేపీలో కలవరం

న్యూఢిల్లీ: బీజేపీకి మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఎంపిక తలనొప్పిగా మారింది. విజయం సాధించామన్న ఉత్సాహం నీరుగారిపోతోంది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లో గెలుపు తర్వాత చాలామంది సీఎం రేసులోకి వచ్చారు. దీంతో కాషాయ పార్టీలో కలవరం కొనసాగుతోంది. పార్టీలో ఇప్పుడు ఈ మూడు రాష్ట్రాల కొత్త ముఖ్యమంత్రుల ఎంపిక లేదా 2024 సార్వత్రిక ఎన్నికలను ఏ విధంగా ఎదుర్కోవాలన్న

- మిగతా 2 లో

- తలనొప్పిగా సీఎంల ఎంపిక
- మూడు రాష్ట్రాల గెలుపు ఉత్సాహం ఆవిరి
- పార్టీ నేతలతో ఎడతెగని చర్చలు
- మూడు రాష్ట్రాలకు పరిశీలకులు

నిరుద్యోగులకు మరో
తీపి కబురు

- గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల
- వివిధ శాఖల్లో 81 పోస్టులు
- మార్చి 17న ప్రిలిమినరీ పరీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని నిరుద్యోగులకు ప్రభుత్వం మరో శుభవార్త తెలిపింది. గ్రూప్-1 నోటిఫికేషన్‌ను శుక్రవారం ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) సెక్రటరీ జె.ప్రదీప్ కుమార్ విడుదల చేశారు. వివిధ విభాగాల్లో గ్రూప్-1 పోస్టులు మొత్తం 81 ఉన్నాయి. ఇందులో డిప్యూటీ కలెక్టర్లు 9, ఏపీ స్టేట్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్లు 18, డీఎస్పీలు (సివిల్) 26, ఆర్‌టీఓలు 6 పోస్టులతో పాటు ఫైర్, జిల్లా బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖ, ట్రెజరరీ, ఏపీ కోపరేటివ్ సొసైటీ, మున్సిపల్ తదితర విభాగాల్లో ఖాళీలు ఉన్నాయి. ఈ పోస్టులకు వచ్చే ఏడాది జనవరి ఒకటవ తేదీ నుంచి 21 వరకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులను ఏపీపీఎస్సీ స్వీకరిస్తుంది. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలతో పాటు ఇంటర్వ్యూల ఆధారంగా ఈ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మార్చి 17న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను నిర్వహిస్తారు. ప్రిలిమ్స్ పరీక్షకు నిరుద్యోగులు సన్నద్ధం అయ్యేందుకుగాను దాదాపు వంద రోజులపాటు సమయం ఉంది. ఈ ఏడాదిలో ఇప్పటికే ఒక విడతలో గ్రూప్-1 నోటిఫికేషన్‌ను విడుదల చేసి వేగవంతంగా నియామక ప్రక్రియను ఏపీపీఎస్సీ పూర్తి చేసింది. గ్రూప్-1 పరీక్షలను పాత సిలబస్ విధానంలోనే నిర్వహిస్తారు. అటు ఈనెల 7వ తేదీన గ్రూప్-2 నోటిఫికేషన్‌ను ఏపీపీఎస్సీ విడుదల చేసిన విషయం విదితమే. గ్రూప్-2 ద్వారా వివిధ విభాగాల నుంచి మొత్తం 897 పోస్టులను భర్తీ

- మిగతా 2 లో

రైతును ఆదుకోవడంలో
ప్రభుత్వం విఫలం

- కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలి
- నీరో చక్రవర్తిని తలపిస్తున్న సీఎం జగన్: రామకృష్ణ
- కృష్ణా జిల్లాలో సీపీఐ, రైతు సంఘాల పర్యటన

విశాలాంధ్ర-చల్లపల్లి/మోపిదేవి: రైతులను ఆదుకోవటంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని అనేకమండలాలలో నీటమునిగిన పంట పొలాలను రైతుసంఘాల నాయకులతో కలిసి రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. రైతులను పరామర్శించారు. అలాగే తుపాను వలన నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ కృష్ణా జిల్లా మోపిదేవి మండలం కప్తానుపాలెం ప్రధాన రహదారిపై సీపీఐ, తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీల అధ్వర్యంలో నిరసన కార్య క్రమం జరిగింది. రామకృష్ణతో పాటు మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, జనసేన నాయకులు రత్నగోపాల్, శేషుబాబు తదితరులు పాల్గొన్నారు. పెనమలూరు మండలం చోడవరంలోనూ సీపీఐ బృందం పర్యటించింది. అనంతరం ఆయా ప్రాంతాల్లో రామకృష్ణ మాట్లాడుతూ మిచౌంగ్ తుపాన్ ధాటికి అన్నమయ్య, చిత్తూరు జిల్లా మొదలుకొని శ్రీకాకుళం వరకు కృష్ణాతీరం వణికిపోయిందని చెప్పారు. రైతుల పెట్టుబడి నీటిపాలైందని తెలిపారు. ఎకరాకు రూ.30 వేల నుండి రూ.40 వేలు ఖర్చుపెట్టి ధాన్యం పంట పండించిన రైతు నట్టేట మునిగిపోయాడని చెప్పారు. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నీరో చక్రవర్తిలాగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. పులివెందులలో కరువు వచ్చి రైతులు అల్లాడిపోతుంటే కనీసం పలకరించడానికి సీఎం వెళ్లలేదన్నారు. కరువు, తుపానుతో రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూశారని రామకృష్ణ తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో రైతులకు ప్రభుత్వం సకాలంలో టార్పాలిన్లు, సంచులు ఇవ్వలేదని ఆరోపించారు. రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని

- మిగతా 2 లో

సీపీఐ కేరళ కార్యదర్శి
కణం రాజేంద్రన్ కన్నుమూత

రేపు కొట్టాయంలో అంత్యక్రియలు



కొచ్చి: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు, కేరళ రాష్ట్ర కార్యదర్శి కణం రాజేంద్రన్ (73) కన్నుమూశారు. తీవ్రమైన గుండెపోటు రావడంతో ఆయన శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. మధుమేహం కారణంగా ఆయన ఎడుమ కాలు తొలగించాల్సి రాగా అనేక ఆరోగ్య సమస్యలతో కొచ్చిలో అమృతా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆకస్మికంగా గుండెపోటుకు గురై మరణించారు. అక్టోబరు 25 నుంచి ఆయన ఆసుపత్రిలో ఉన్నారు. మధుమేహం నియంత్రణలో లేక గాయం వల్ల ఇన్ఫెక్షన్ సోకడంతో ఆయన ఎడుమ కాలును వైద్యులు తొలగించారు. కోలుకుంటున్న సమయంలో గుండెపోటు రావడంతో వైద్యులు హుటాహుటిన క్రిటికల్ యూనిట్‌కు తరలించి అత్యవసర చికిత్స అందించారు. కానీ ఫలితం లేకపోయింది. సాయంత్రం 5.30 గంటలకు రాజేంద్రన్ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రాజేంద్రన్ భౌతికకాయాన్ని శనివారం ఉదయం 7 గంటలకు తిరువంతపురానికి హెలికాప్టర్‌లో తరలిస్తారు. ఆయన భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం సీపీఐ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంచుతారు. అనంతరం కొట్టాయంకు తరలిస్తారు. కణం రాజేంద్రన్ అంత్యక్రియలు ఆదివారం ఉదయం 11 గంటలకు జరుగుతాయి. సీపీఐ కార్యదర్శి కె.నారాయణ సహా అనేక మంది పాల్గోనున్నారు. అనారోగ్యం కారణంగా పార్టీ నుంచి మూడు నెలల సెలవు తీసుకున్నారు. రాష్ట్రంలో 'నవకేరళ సదస్' జరుగుతుండటంతో ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో సహా కేబినెట్ మొత్తం పట్టణంలోనే ఉంది. 2015లో సీకే చంద్రప్పన్ మరణానంతరం సీపీఐ కేరళ కార్యదర్శి బాధ్యతలను రాజేంద్రన్ చేపట్టారు. ఇటీవల పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశం జరిగి రాజేంద్రన్ స్థానంలో వేరొకరిని నియమించరాదని, ఆయన వచ్చేంత వరకు సహాయ కార్యదర్శులే ఆ బాధ్యతలు చేపట్టాలని నిర్ణయించారు. రాజేంద్రన్ కూడా త్వరలోనే విధులకు హాజరవుతానన్న దీమాతో

- మిగతా 2 లో

కొట్టుకుపోయిన 'గుండ్లకమ్మ' గేటు

విశాలాంధ్ర-ఒంగోలు: తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా వరద పోటెత్తడంతో గుండ్లకమ్మ ప్రాజెక్టులో రెండో గేట్ శుక్రవారం కొట్టుకుపోయింది. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గం మద్దిపాడు మండలం మల్లవరం గ్రామంలో శ్రీ కందుల ఓబుల్ రెడ్డి డ్యామ్‌లోకి పెద్ద ఎత్తున వరద రావడంతో గేటు కొట్టుకుపోయింది. దీంతో ప్రాజెక్టు నుంచి నీరు వృథాగా పోతోంది. గతేడాది ఆగస్టులో కొట్టుకుపోయిన గుండ్లకమ్మ మూడో గేట్ ఇప్పటికీ పూర్తి స్థాయిలో మరమ్మతులకు నోచుకోలేదు. కాగా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోతున్నాయని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ విమర్శించారు.

ఇదీ లోకం!



మరీ.. అలా సర్రున పైకి గీసేయొద్దు.. పుంజీడు ఉద్యోగాలిస్తున్నాం!

కేసీఆర్‌కు తుంటి గాయం

- జారిపడిన మాజీ సీఎం
- యశోదా ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేసిన వైద్యులు
- ఆరోగ్య పరిస్థితిపై సీఎం రేవంత్... ప్రధాని మోదీ ఆరా

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తుంటికి తీవ్ర గాయమైంది. ఆయన తన ఫాంహౌస్‌లో కాలుజారి కిందపడ్డారు. తెలంగాణ ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి ఫాంహౌస్‌లో ఉంటున్న

- మిగతా 2 లో

మూడు నెలల తర్వాత...
జనంలోకి చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మూడు నెలల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ జనంలోకి వచ్చారు. భవిష్యత్‌కు భరోసా పేరుతో రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్న చంద్రబాబు సెప్టెంబరు 8వ తేదీ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్ట్ అయ్యారు. ఏసీబీ కోర్టు రిమాండ్ విధించడం, రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా 52 రోజులు గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. బెయిల్ వచ్చినప్పటికీ కోర్టు కొన్ని షరతులు విధించింది. నవంబరు 28వ తేదీ వరకు ఈ కేసుపై ఎటువంటి వ్యాఖ్యానాలు చేయకూడదని, రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనరాదని ఆంక్షలు విధించింది. దీంతో రెగ్యులర్ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. నవంబరు 20వ తేదీన హైకోర్టు ఆయనపై ఉన్న అన్ని ఆంక్షలు ఎత్తివేస్తూ రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. 28వ తేదీ తర్వాత ఆంక్షలన్నీ తొలగిపోతాయని ప్రకటించడంతో చంద్రబాబు అప్పటివరకు ఇంటికే పరిమితమయ్యారు. ఈలోగా చంద్రబాబు తిరుపతి వెంకటేశ్వరస్వామితో పాటు విజయవాడ కనకదుర్గ, మరికొన్ని ఆలయాలు సందర్శించి మొక్కు తీర్చుకున్నారు. మొత్తానికి మూడు నెలల తర్వాత శుక్రవారం మొదటిసారిగా ఆయన మిచౌంగ్ తుపాన్ బాధితులను

- మిగతా 2 లో

ప్రతి రైతును
ఆదుకుంటాం

బాపట్లలో ముంపు పొలాలు పరిశీలించిన సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల/తిరుపతి : మిచౌంగ్ తుపాను ప్రభావంతో పంట పొలాలు నీట మునిగి నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. బాపట్ల నియోజకవర్గంలో శుక్రవారం సీఎం జగన్ వరద నీటిలో ఉన్న పంట పొలాలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ రైతులకు బాధాకరమైన పరిస్థితులు వచ్చినప్పటికీ ప్రభుత్వం తోడుగా నిలబడుతుందన్నారు. ప్రజల ప్రభుత్వంలో మంచే జరుగుతుంది తప్ప ఏ ఒక్కరికీ చెడు జరగదని చెప్పారు. సచివాలయం వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ మనకు అందుబాటులోనే ఉందని, వివరాలు నమోదు చేస్తున్నామని సీఎం తెలిపారు. వివక్షకు తావులేకుండా, నష్టం ఎవరికి జరిగినా కూడా పార్టీలకు అతీతంగా ప్రభుత్వం బాసటగా నిలుస్తుందన్నారు. సచివాలయాల్లో నష్టపోయిన రైతుల వివరాలు ప్రదర్శిస్తారని, పొరపాటున పేరు నమోదు కాకుంటే, మరోసారి నమోదు చేసి సహాయం అందజేస్తామని తెలిపారు. గతంలో కరవు, వరదలు వచ్చినా పట్టించుకున్నది లేదన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ ఎంత మందికి వస్తుందో కూడా లెక్కలు ఉండేవికావన్నారు. వైసీపీ నాలుగున్నరేళ్ల

- మిగతా 2 లో

లెబనాన్ మరో గాజా అవుతుంది

హెజ్బుల్లాకు ఇజ్రాయిల్ హెచ్చరిక

జెరూసలేం: గాజాపై వైమానిక, భూతల దాడులతో రెచ్చిపోతున్న ఇజ్రాయిల్ తన దృష్టిని లెబనాన్ వైపునకు మళ్లించింది. ఉత్తర గాజా ఇప్పటికే శిథిలం కాగా దక్షిణ గాజాలోనూ పోరు ఉధృతంగా సాగుతోంది. ఇంకా దకూడుగా వ్యవహరిస్తూ లెబనాన్‌పై కాలు దువ్వుతోంది. ఇప్పటికే హెజ్బుల్లాతో తలపడుతోంది. సరిహద్దు ప్రాంతాల్లో దాడులు జరుపుతోంది. తమ జోలికి రావద్దంటూ హెజ్బుల్లాకు ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తాజాగా హెచ్చరికలు చేశారు. ఇజ్రాయిల్ రక్షణ దళాల కేంద్ర కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా 'ఇజ్రాయిల్‌పై యుద్ధం చేయాలన్న ఆలోచన మానుకోండి. లేదంటే బీరుట్, దక్షిణ లెబనాన్‌లను గాజా, ఖాన్ యూనియన్‌గా మార్చేస్తాం. అవేమీ పెద్ద దూరం లేవు' అని హెచ్చరిక చేశారు. గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయిల్ దళాలను ఎదుర్కొనేందుకు హమాస్‌కు హెజ్బుల్లా మద్దతిస్తోంది. దీంతో ఇజ్రాయిల్-హెజ్బుల్లా మధ్య రోజు పోరు జరుగుతోంది. అదే సమయంలో ఇజ్రాయిల్-హమాస్ మధ్య పోరు ప్రాదేశిక యుద్ధంగా మారకుండా ఉండేందుకు పూర్తిస్థాయి సైనిక చర్యలను హెజ్బుల్లా చేపట్టడంలేదు.

ఇజ్రాయిల్ సైన్యం తీరు అభ్యంతరకరం: మానవహక్కుల సంస్థ

ఇజ్రాయిల్ దళాలు తమ వద్ద బందీలుగా ఉన్న గాజా ప్రజలతో అనుచితంగా వ్యవహరిస్తున్నారని మానవహక్కుల పర్యవేక్షణ సంస్థ 'ది యూరో-మెడిటేరియన్ హ్యూమన్ రైట్స్ మానిటర్' ఆరోపించింది. బందీలుగా ఉన్న పురుషులను వేధిస్తోందని పేర్కొంది. కళ్లకు గంతలు కట్టి లోదుస్తులలో ఉంచుతున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు ఫొటోలను పోస్టు చేసింది. వలస వెళుతున్న వారిని, వైద్యులు, విద్యావేత్తలు, జర్నలిస్టులు, వృద్ధులను అకారణంగా, ఏకపక్షంగా అరెస్టు చేసి ఇబ్బంది పెడుతున్నట్లు కూడా తెలిపింది. అయితే ఆ చిత్రాలు లొంగిపోయిన హమాస్ సైనికులవిగా ఇజ్రాయిల్ మీడియా ప్రచారం చేస్తోంది. మానవ హక్కుల పర్యవేక్షణ సంస్థ విడుదల చేసిన ఫొటోలలో తమ ప్రతినిధి ఉన్నట్లు అల్ అరబ్ అల్ జదీద్ వార్తాసంస్థ పేర్కొంది. గాజాలోని అల్ అరబ్ కార్యాలయం నుంచి ఆయనను ఇజ్రాయిల్ సైన్యం అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించింది. అరెస్టు చేసిన తర్వాత దుస్తులు తొలగించి గుర్తుతెలియని ప్రదేశానికి తరలించినట్లు తెలిపింది.

ఇజ్రాయిల్‌కు అండగా ఉంటాం: బైడెన్

ఇజ్రాయిల్‌కు తమ మద్దతు కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తేల్చిచెప్పారు. జోర్డాన్ రాజు అబ్దుల్లాతో జరిపిన ఫోన్ సంభాషణలో గాజా పరిస్థితులపై చర్చించారు. పలస్తీనా ప్రజలకు మానవతా సాయాన్ని పెంచేందుకు కట్టుబడి ఉన్నట్లు చెబుతూనే ఇజ్రాయిల్‌కు తమ అండదండలు ఉంటాయని బైడెన్ తెలిపారు. గాజాలో శాంతి సుస్థిరత నెలకొనేందుకు కలిసి పనిచేద్దామని కూడా జోర్డాన్ రాజుతో ఆయనన్నారు.

విశాలాంధ్ర ప్రపంచం

94 మంది జర్నలిస్టుల హత్య

గాజాలోనే 68 మంది మృతి - జైళ్లపాలైన మరో 400 మంది

ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ వార్షిక నివేదికలో వెల్లడి

బ్రసెల్స్: ప్రపంచ వ్యాప్తంగా మీడియా సిబ్బందిపై దాడులు, హత్యలు జరుగుతున్న క్రమంలో వారి ప్రాణాలకు రక్షణ కల్పించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌జే) పిలుపునిచ్చింది. ఈ ఏడాది ఇప్పటివరకు 94 మంది జర్నలిస్టులు/మీడియా వర్కర్లు ప్రాణాలు కోల్పోయినట్లు వార్షిక నివేదికలో తెలిపింది. వీరిలో అత్యధికంగా 68 మంది గాజాలో చనిపోయారు. గత 30ఏళ్లలో జరిగిన ఘర్షణల్లో సంభవించనన్ని జర్నలిస్టుల మరణాలు అక్టోబరు 7 నుంచి హమాస్-ఇజ్రాయిల్ మధ్య సాగుతున్న పోరులో నమోదైనట్లు వెల్లడించింది. గాజాలో సంభవించిన జర్నలిస్టుల మరణాలు ప్రపంచవ్యాప్తంగా నమోదైన మీడియా సిబ్బంది మరణాల్లో 72శాతమని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా మరో 400 మంది నిర్బంధానికి గురైనట్లు నివేదిక పేర్కొంది. మీడియా సిబ్బందికి మెరుగైన రక్షణ, జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన వారి మీద తగు చర్యలకు ఐఎఫ్‌జే డిమాండ్ చేసింది. రెండేళ్లుగా ఉక్రెయిన్ కూడా జర్నలిస్టులకు ప్రమాదకరమైన దేశంగా మారిందని తెలిపింది. అక్కడ యుద్ధంలో ఈ ఏడాది ముగ్గురు రిపోర్టులు చనిపోయినట్లు పేర్కొంది. అఫ్గాన్, ఫిలిప్పీన్స్, భారత్, చైనా, బంగ్లాదేశ్‌లోనూ జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. గతేడాదితో పోల్చితే ఉత్తర-దక్షిణ అమెరికాలో జర్నలిస్టుల హత్యలు తగ్గాయని, ఈ ఏడాది ఏడుగురు ప్రాణలు కోల్పోయరని తెలిపింది. పరాగ్వాన్, గౌటెమాల, కొలంబియాలోనూ ఒక్కొక్కరు హత్యకు గురైనట్లు పేర్కొంది. ఈ ఏడాది జైలు పాలైన జర్నలిస్టుల సంఖ్య 393 కాగా అత్యధికంగా 80 మంది చైనా, హాంగ్‌కాంగ్ కారావాసాల్లో ఉన్నట్లు వెల్లడించింది. మైన్మార్‌లో 54, టర్కీలో 41, రష్యా-ఆక్రమిత క్రిమియా (ఉక్రెయిన్ భూభాగం)లో 40, బెలారస్‌లో 35, ఈజిప్టులో 23 మంది చొప్పున జర్నలిస్టులు ఖైదులో ఉన్నారని ఐఎఫ్‌జే తెలిపింది.

'విద్య అఫ్గాన్ బాలికల హక్కు'

మంత్రి షేర్ మహమ్మద్ అబ్బాస్

కాబుల్: బాలికలు మరలా బడిబాట పట్టాలని, వారి కోసం పాఠశాలలను తిరిగి తెరవాల్సిన అవసరం ఉందని అఫ్గాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి షేర్ మహమ్మద్ అబ్బస్ అన్నారు. జ్ఞానం లేని సమాజం చీకటిలోకంతో సమానమన్నారు. అఫ్గాన్ సరిహద్దు శాఖ, గిరిజన వ్యవహారాల శాఖ అధ్వర్యంలోని విద్యాసంస్థల విద్యార్థుల కోసం నిర్వహించిన స్నాతకోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళల విద్యపై ఆంక్షలతో తాలిబన్లకు ప్రజలు దూరమైనట్లు తెలిపారు. విద్య అందరి హక్కు, దానిని కాదనడం ప్రజాప్రయోజనాలకు విరుద్ధం. విద్యాసంస్థలను తిరిగి అందరికీ అందుబాటులోకి తేవడం అవసరం. ఇందుకు ప్రయత్నాలు జరగాలి. విద్యపై ఆంక్షలతో పొరుగు దేశాలతో సంబంధాలు చెడిపోతున్నాయి. దేశంతో పాటు ప్రజలూ ఇబ్బంది పడుతున్నారు. ఈ పద్ధతిలో మార్పు ఎంతైనా అవసరమని మంత్రి మహమ్మద్ అబ్బాస్ అన్నారు. అయితే రెండేళ్ల కిందట అఫ్గాన్ తాలిబన్ల వశమైంది. అప్పటి నుంచి ప్రజలపై అనేక ఆంక్షలు విధించబడ్డాయి.

ముఖ్యంగా మహిళలు, బాలికల జీవితాలు దుర్భరమయ్యాయి. ఆరో తరగతికి మించి విద్యను అభ్యసించే హక్కు బాలికలకు లేకుండా పోయింది. అంతర్జాతీయంగా విమర్శలు వ్యక్తమైనాగానీ తాలిబన్ ప్రభుత్వ తీరు మారలేదు. ఇలాంటి పరిస్థితుల్లో బాలికలు-మహిళలకు విద్య హక్కుల ఉన్నదంటూ తాలిబన్ మంత్రి మాట్లాడటం చర్చనీయాంశంగా మారింది.

నిరుద్యోగులకు మరో తీపి కబురు

(మొదటిపేజీ తరువాయి)

చేయనున్నారు. ఇందులో ఎగ్జిక్యూటివ్ పోస్టులు 331, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు 566 ఉన్నాయి. దీంతో గ్రూప్-1, గ్రూప్-2 నోటిఫికేషన్ల ద్వారా మొత్తంగా 978 పోస్టులను ఏపీపీఎస్సీ భర్తీ చేయనుంది. వరుస వారీగా నోటిఫికేషన్లు రావడంతో నిరుద్యోగ యువత ఊరట చెందుతున్నారు. గ్రూప్-1 నోటిఫికేషన్ పూర్తి వివరాలను psc.ap.gov.in వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచారు.

కేసీఆర్‌కు తుంటి గాయం

(మొదటిపేజీ తరువాయి)

ఆయన గురువారం అర్ధరాత్రి సమయంలో పడిపోయారు. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు గాయపడిన ఆయనను హుటాహుటిన హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలిసిన వెంటనే స్పందించిన ప్రభుత్వం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి, పోలీసు అధికారులు ట్రాఫిక్ క్లియరెన్స్‌తో కేసీఆర్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా స్పందించి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన యశోదా ఆస్పత్రి సిబ్బంది... కేసీఆర్‌కు తుంటి ఎముక విరిగిపోయినట్లు వెల్లడించారు. సిటీస్కాన్ చేసిన వైద్యులు ఎడమకాలి తుంటి విరిగిందని, శస్త్ర చికిత్స ద్వారా తుంటి మార్పిడి చేయవలసి వస్తుందని హెల్త్ బులిటిన్ విడుదల చేశారు. ఆయన కోలుకోవడానికి ఇందుకు 6 నుంచి 8 వారాల సమయం పడుతుందని తెలిపారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉందని వెల్లడించారు. సాయంత్రం కేసీఆర్‌కు శస్త్ర చికిత్స నిర్వహించారు. యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేసీఆర్ వెంట భార్య శోభమ్మ, తనయుడు, మాజీ మంత్రి కేటీఆర్, కూతురు కవిత, ఎంపీ సంతోశ్ కుమార్, మాజీ మంత్రి హరీశ్ రావు తదితర కుటుంబ సభ్యులు ఉన్నారు. ఈ వార్త తెలిసిన నేపథ్యంలో కేసీఆర్‌ను పరామర్శించేందుకు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆస్పత్రికి భారీగా తరలివచ్చారు. అయితే కేసీఆర్‌కు శస్త్ర చేయాల్సి ఉండటంతో వైద్యులు ఎవరినీ కూడా లోపలికి అనుమతించలేదు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు స్పందిస్తూ నేతలు, అభిమానులు, కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు. ప్రస్తుతం కేసీఆర్ ఆరోగ్యం నిలకడగానే ఉందని చెప్పారు. తుంటి మార్పిడి శస్త్ర చికిత్స ఉందని, అందువల్ల శస్త్ర చికిత్స సమయంలో ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉండడంతో ఎవరూ ఆస్పత్రికి రావద్దని సూచించారు. ఈ సందర్భంగా మాజీ సీఎంను పరామర్శించడానికి యశోదా ఆస్పత్రికి మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఆయన తనయుడు జయవీర్‌రెడ్డి కూడా చేరుకున్నారు.

కేసీఆర్ ఆరోగ్యంపై స్పందించిన మోదీ

కేసీఆర్ ఆరోగ్యంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. కేసీఆర్‌కు గాయమైన విషయం తెలియగానే తాను చాలా బాధపడ్డట్లు ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తెలిపారు. ఆయన త్వరగా కోలుకోవాలని, మంచి ఆరోగ్యంతో ఉండాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. కేసీఆర్‌కు స్వల్ప గాయమైందని, ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఎమ్మెల్సీ కవిత 'ఎక్స్' ద్వారా స్పందించారు. ఆయన త్వరలోనే కోలుకుంటారని వెల్లడించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై స్పందించిన ప్రధాని మోదీకి, అలాగే ప్రజల ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు తెలిపారు.

కేసీఆర్‌కు అవసరమైన వైద్యం అందించండి : రేవంత్‌రెడ్డి

కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై సమాచారం అందుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు తనకు సమాచారం ఇవ్వాలని వైద్య శాఖను ఆదేశించారు. మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కావాల్సిన అన్ని చర్యలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీకి సూచించారు. సీఎం ఆదేశాలతో యశోదా ఆస్పత్రికి వెళ్లిన ఆరోగ్య కార్యదర్శి అక్కడి వైద్యులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రస్తుతం కేసీఆర్ అరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, చికిత్స అనంతరం అయనకు 6 నుంచి 8 వారాల పాటు విశ్రాంతి అవసరమని వివరించారు.

మహువాపై బహిష్కరణ వేటు

(మొదటిపేజీ తరువాయి)

అమర్యాదకరంగా ప్రవర్తించారని కమిటీ చేసిన తీర్మానాన్ని సభ అంగీకరించిందని, అందువల్ల ఆమె ఇక ఎంపీగా కొనసాగడం తగదని స్పీకర్ ఓం బిర్లా వెల్లడించారు. మొయిత్రా లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ ఆమెను సభ నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఆమెపై వచ్చిన ఆరోపణలపై ఎథిక్స్ కమిటీ ఇచ్చిన నివేదికను నేడు లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం ఆమెను బహిష్కరించాలని డిమాండ్ చేస్తూ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ తీర్మానాన్ని పెట్టారు. ఈ తీర్మానాన్ని విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. నైతిక విలువల కమిటీ ఇచ్చిన నివేదికపై అధ్యయనం చేసేందుకు తమకు కొంత సమయమివ్వాలని, నివేదికపై ఓటింగ్‌కు ముందు సభలో చర్చ జరపాలని టీఎంసీ సహా విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. కాగా, నివేదికపై చర్చించేందుకు స్పీకర్ ఓం బిర్లా అనుమతిచ్చారు. ఈ సందర్భంగా అధికార, విపక్షాల మధ్య వాడీవేడీ చర్చ జరిగింది. ఈ చర్చలో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని మహువా కోరగా సభాపతి అందుకు అనుమతించలేదు. అనంతరం మూజువాణీ ఓటింగ్ ద్వారా ఈ నివేదికను లోక్‌సభ ఆమోదించింది. తర్వాత మహువాను బహిష్కరిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. సభను వచ్చే సోమవారానికి (డిసెంబరు 11) వాయిదా వేశారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ ఓటింగ్ సమయంలో విపక్షాలు వాకౌట్ చేశాయి.

నా నోరు మూయించలేరు: మహువా

తన బహిష్కరణను ఎంపీ మహువా మొయిత్రా తీవ్రంగా వ్యతిరేకించారు. నైతిక విలువల కమిటీ ప్రతి నిబంధనను ఉల్లంఘించిందని, తమను అణగదొక్కేందుకు ఈ కమిటీని ఓ ఆయుధంగా ఉపయోగించుకున్నారని మహువా విమర్శించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం ఇద్దరు వ్యక్తులు చెప్పిన మాటలు నమ్మి తనను దోషిగా నిర్ధారించారని, ఇక, రేపు తన ఇంటికి సీబీఐని పంపించి వేధిస్తారేమోనని మహువా మండిపడ్డారు. ఇది ముమ్మాటికీ తొందరపాటు చర్య అని చెప్పారు. ఎన్ని కుట్రలు చేసినా మోదీ సర్కారు తన నోరు మూయించలేదని మహువా స్పష్టంచేశారు. సభలో తనకు అండగా నిలిచిన ప్రతిపక్ష ఇండియా కూటమి సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. అదానీ విషయంలో తన నోరు మూయించాలని మోదీ సర్కారు కలలు కంటున్నదని, అది మాత్రం నెరవేరదని తేల్చిచెప్పారు. మొయిత్రా వెంట సోనియాగాంధీ, దానిశ్ అలీ సహా కాంగ్రెస్, బీఎస్‌పీ, తృణమూల్ నేతలు ఉన్నారు. ఇక మహాభారత యుద్ధాన్ని చూస్తారు' అంటూ ఘాటుగా స్పందించారు. నివేదికపై మహువా మెయిత్రా పార్లమెంటు వద్ద మీడియాతో మాట్లాడుతూ...దుర్గా మాత వచ్చింది. ఇక చూసుకుందాం. వినాశనం సంభవించినప్పుడు మొదట కనుమరుగయ్యేది వివేకమే, వస్త్రాపహరణను వాళ్లు మొదలుపెట్టారు. ఇక మహాభారత యుద్ధాన్ని చూస్తారు' అని మోదీ సర్కార్‌పై ఘాటు విమర్శలు చేశారు. కమిటీ నివేదిక కాపీ తమకు ఇవ్వాలని, ఓటింగ్‌కు ముందు చర్చ జరిపాలని, మహువా మొయిత్రీ తన వాదన వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను టీఎంసీ ఎంపీలు కోరారు. అందుకు స్పీకర్ నిరాకరిస్తూ 2005లో స్పీకర్ సోమనాథ్ ఛటర్జీ తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తావించారు. డబ్బులు తీసుకుని ప్రశ్నలు అడిగారనే ఆరోపణలను ఎదుర్కొన్న 10 మంది ఎంపీలను సభలో మాట్లాడేందుకు నాటి స్పీకర్ సోమ్‌నాథ్ ఛటర్జీ అనుమతించలేదని గుర్తు చేశారు. నాటి స్పీకర్లు పాటించిన సంప్రదాయాన్ని తాను అనుసరిస్తున్నట్టు ఓం బిర్లా చెప్పారు.

లోక్‌సభలో ప్రశ్నలు అడిగేందుకు పారిశ్రామికవేత్త హీరానందానీ నుంచి మహువా డబ్బులు తీసుకున్నారన్న ఆరోపణలపై నైతిక విలువల కమిటీ విచారణ జరిపిన సంగతి తెలిసిందే. ఈ దర్యాప్తులో భాగంగానే మహువా మొయిత్రాతో పాటు ఆమెపై ఫిర్యాదు చేసిన బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబే, న్యాయవాది జై అనంత్ దెహద్రాయ్‌ను కమిటీ విచారించింది. అనంతరం 500 పేజీలతో కూడిన నివేదికను రూపొందించింది. మహువా అనైతిక ప్రవర్తన, సభా ధిక్కరణకు పాల్పడ్డారని కమిటీ పేర్కొంది. నిబంధనలకు విరుద్ధంగా తన పార్లమెంట్ లాగిన్ వివరాలు బయటి వ్యక్తులకు ఇచ్చినట్లు కమిటీ నిర్ధారించింది.

బీజేపీలో కలవరం

(మొదటిపేజీ తరువాయి)

దానిపైనే చర్చలన్నీ కేంద్రీకృతమయ్యాయి. మూడు రాష్ట్రాల విజయం ప్రధాని మోదీకి ఆమోదముద్రగా, కాంగ్రెస్‌కు అడ్డుకట్ట వేశామని ఆ పార్టీ సీనియర్ నేతలు భావిస్తున్నప్పటికీ వారిలో లోలోన భయం వెంటాడుతూనే ఉంది. కొత్త సీఎంల ఎంపిక వ్యవహారాన్ని వారు ఒక పట్టానా తేల్చలేకపోతున్నారు. బీజేపీలో ఆనందం వెనుక ఆందోళనా కనిపిస్తోంది. సీఎం ఎంపిక బాధ్యత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్రహోంమంత్రి అమిత్ షాపై పడింది. రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకత్వం రాష్ట్రాలకు కొత్త ముఖాలను ఎన్నుకునే అవకాశం ఉందని ఒక ఆంగ్ల వార్తా సంస్థ కథనం పేర్కొంది. బీజేపీ కేంద్ర నాయకత్వం అధికారికంగా ఇంకా ఎవరినీ దిల్లీకి పిలవకపోయినప్పటికీ... సీఎం అభ్యర్థులు భవిష్యత్తు వ్యూహాలను సిద్ధం చేయడం మొదలుపెట్టారు. పనిలో పనిగా మూడు రాష్ట్రాలకు సీనియర్ నేతలను పరిశీలకులుగా అధిష్ఠానం పంపింది.

రాజస్థాన్ లెక్కే వేరు!

రాజస్థాన్‌లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య గెలుపు, ఓటమి చాలా దగ్గరగా ఉందని సంఖ్యాబలం చూపిస్తోంది. 2018 ఎన్నికల్లో బీజేపీ అధికారం కోల్పోయింది. 200 సీట్లకుగాను 73 సీట్లు గెలుచుకున్నప్పుడు బీజేపీ ఓట్ల శాతం 38.08 శాతంగా ఉంది. మరోవైపు 101 సీట్లతో కాంగ్రెస్‌కు 39.3 శాతం ఓట్లు వచ్చాయి. స్వతంత్రులతో కలిసి స్వల్ప మెజారిటీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 6 శాతం ఓట్లను పొందగా, 2018లో తమకు అనుకూలంగా పోలైన ఓట్లలో 6.4 శాతం ఓట్లను బీజేపీ కోల్పోయింది. 2023 సంవత్సరంలో 199 సీట్లకుగాను 115 స్థానాల్లో గెలిచిన బీజేపీ ఓట్లశాతం 41.69 మాత్రమే. కాంగ్రెస్ తన ఓట్ల వాటాను మరికొంత పెంచుకుంది.

ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం కాంగ్రెస్‌కు మొత్తం ఓట్లలో 39.53 శాతం ఓట్లతో 0.23 శాతం పెరిగాయి. కాంగ్రెస్ ఓట్ల శాతం పెంపు బీజేపీకి ఆందోళన కలిగిస్తోంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నష్టపోయినప్పటికీ రాష్ట్రంలో మరింత దృఢమైన పార్టీగా కనిపిస్తోంది. ఓట్ల పరంగా కాంగ్రెస్ వృద్ధి చెందడం బీజేపీకి ఆందోళన కలిగించే అంశం. బీజేపీకి దాని సొంత నాయకత్వ సమస్యలు ఉన్నాయి. సీఎం అభ్యర్థిని ప్రకటించకుండా ఎన్నికల్లో పోటీ చేసింది. కష్టపడి తన ప్రముఖ ప్రచారకర్తలపై ఆధారపడవలసి వచ్చింది. కాంగ్రెస్ ఇప్పటికీ ఓట్ల వాటాపరంగా ముందుకు సాగగలిగింది. రాష్ట్రాల్లో ఈ ఆందోళనలు కొనసాగుతుండగా, లోక్‌సభ ఎన్నికలు ఎప్పుడూ భిన్నమైన ఆటే. ఏదేమైనప్పటికీ అసెంబ్లీ ఎన్నికల పోకడలు, ప్రధాని మోదీ ఆధారంగానే మరోసారి సార్వత్రిక పోరులో కష్టపడక తప్పదని ఆ పార్టీ నేతలకు ఇప్పటికే స్పష్టమైంది.

మూడు రాష్ట్రాల్లో సీఎంలు వారే?

మూడు రాష్ట్రాల్లో బీజేపీకి ముఖ్యమంత్రుల ఎంపిక సవాలుగా మారుతోంది. ముఖ్యంగా వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి కేంద్రంలో మరోసారి అధికారంలోకి రావాలంటే కీలకమైన మూడు హిందీ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల గెలుపుతో జోరు మీదున్న బీజేపీ... జాగ్రత్తగా పావులు కదిపితే ఇక్కడి నుంచి భారీగా ఎంపీలను గెలిపించుకోవచ్చనే ఆలోచనలో ఉంది. దీంతో మూడు రాష్ట్రాల్లోనూ కొత్త ప్రయోగానికి సిద్ధమవుతోంది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లో ముఖ్యమంత్రి పదవికి కొత్త ముఖాలను ఎంపిక చేసేందుకు బీజేపీ సిద్ధమవుతోంది.

2024 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వీరి ఎంపిక జరగబోతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ముఖ్యమంత్రి అభ్యర్థులపై పార్టీ కేంద్ర నాయకత్వం చర్చలు జరుపుతోంది. రెండు రోజుల క్రితం మోదీ నివాసంలో నాలుగున్నర గంటలపాటు జరిగిన భేటీలో సీఎం అభ్యర్థుల పేర్లను పరిశీలించారు. శుక్రవారం బీజేపీ కేంద్ర నాయకత్వం మూడు రాష్ట్రాలకు పరిశీలకులను నియమించింది. అసెంబ్లీలో తమ నాయకులను ఎన్నుకునేందుకు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల సమావేశాలను పరిశీలకులు పర్యవేక్షిస్తారు. మధ్యప్రదేశ్‌లో ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మరోసారి రేసులో ముందున్నారు. ఆయనతో పాటు కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ పటేల్, జ్యోతిరాదిత్య సింధియా, నరేంద్రసింగ్ తోమర్, సీనియర్ నేత కైలాశ్ విజయవర్గియా పోటీలో ఉన్నారు. రాజస్థాన్‌లో సీఎం పదవికి పోటీ పడుతున్న వారిలో మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, అర్జున్‌రామ్ మేఘ్వాల్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సీపీ జోషి, సీనియర్ నేతలు దియాకుమారి, మహంత్ బాలక్‌నాథ్ ఉన్నారు.

మరోవైపు, చత్తీస్‌గఢ్‌లో సీఎం పదవికి పోటీ పడుతున్న వారిలో మాజీ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్‌కుమార్ సావో, ప్రతిపక్ష నేత ధర్మలాల్ కౌశిక్, మాజీ ఐఏఎస్ అధికారి ఓపీ చౌదరి ఉన్నారు.

రైతును ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. సహకార సంఘాలలో, బ్యాంకులలో రైతులు తీసుకున్న రుణాలు మాఫీ చేయాలని కోరారు. నియంత పాలన సాగించిన కేసీఆర్‌కు పట్టినగతే జగన్‌మోహనరెడ్డికీ తప్పదన్నారు. రైతులంతా కష్టాల్లో ఉన్న ప్రజలను ముఖ్యమంత్రి కనీసం పరామర్శించలేదన్నారు. రాష్ట్రానికి వ్యవసాయ శాఖమంత్రి ఉన్నా లేనట్టేనని విమర్శించారు.

ప్రభుత్వం మెడలు వంచైనా పరిహారం సాధిస్తాం

ప్రభుత్వం మెడలు వంచైనా పరిహారం సాధిస్తామని కె.రామకృష్ణ స్పష్టంచేశారు. రైతువ్యతిరేక ప్రభుత్వం రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్నదని విమర్శించారు. పార్టీలకతీతంగా 9వ తేదీన విజయవాడలోని సీపీఐ కార్యాలయంలో 26 జిల్లాల రైతునాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామని, అందులో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రైతులు ధైర్యం కోల్పోవద్దని చెప్పారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడిన ప్రాంతమని, అతివృష్టి వచ్చినా, అనావృష్టి వచ్చినా ముందుగా నష్టపోయేది ఈ ప్రాంతమేనని చెప్పారు. గతంలో పనిచేసిన ముఖ్యమంత్రులు ప్రకృతి విపత్తుల సమయంలో నియోజకవర్గానికి వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులను ఓదార్చి, న్యాయం చేయదానికి ప్రయత్నం చేశారని, కానీ సీఎం జగన్ మాత్రం అందుకు భిన్నమన్నారు. కనీసం మంత్రులు కూడా రైతులకు భరోసా ఇవ్వలేకపోయారని ఆరోపించారు. పంట పూర్తిగా దెబ్బతినడంతో ధైర్యం కోల్పోయిన వరప్రసాద్ అనే రైతు పంటను ట్రాక్టర్‌తో తొక్కించాడని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో రైతులకు మనోధైర్యం కల్పించడానికి టీడీపీ, జనసేన, సీపీఐ ఆందోళనకు దిగాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య, సీపీఐ సీనియర్ నేత నార్ల వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య, జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్‌బాబు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, కార్యదర్శి గుత్తికొండ రామారావు, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వేమూరి రత్నగిరిరావు, సీపీఐ నాయకులు, కొల్లూరి శ్రీధర్, నక్క శ్రీనివాసరావు, అల్లూరి బాబురావు, సిద్ధబత్తుల వాసు, టీడీపీ నాయకులు తుమ్మల చౌదరి బాబు, మోర్ల రాంబాబు, మోర్ల శివ, షేక్ నబీ ఘోరీ, యార్లగడ్డ శ్రీనివాసరావు, పైడిపాముల కృష్ణకుమారి, కొల్లు వెంకటేశ్వరరావు, నడకుదుటి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కణం రాజేంద్రన్ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. పార్టీ కూడా అలాగే అనుకుంది. కణం రాజేంద్రన్ 1950, నవంబరు 10న కొట్టాయం జిల్లా కొట్టిక్కల్‌లో జన్మించారు. ఏఐవైఎఫ్ నేతగా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 1969లో 19 ఏళ్ల వయస్సులో ఏఐవైఎఫ్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. రెండేళ్ల తర్వాత సీపీఐ సభ్యత్వం పొందారు. ఈయన రెండుసార్లు కొట్టాయం జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. 1982, 1987లో వజూర్ నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. కేరళ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్‌కు రాష్ట్ర కార్యదర్శిగా, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, కేఈడబ్ల్యూఎఫ్ అధ్యక్షుడిగా, ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు.

ఆదర్శ కమ్యూనిస్టు రాజేంద్రన్: సీపీఐ

కణం రాజేంద్రన్ అకాల మరణం తీరని లోటని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పేర్కొంది. ఆదర్శ కమ్యూనిస్టుగా ఆయనను శ్లాఘించింది. కేరళలో లెఫ్ట్ ప్రభుత్వం ఏర్పాటులో కీలకపాత్ర పోషించారని గుర్తుచేసింది. రాజేంద్రన్ మరణం వామపక్ష ఉద్యమానికి తీరనిలోటుగా పేర్కొంది. రాజేంద్రన్ మృతికి సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాక రరెడ్డి, కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, ఏఐకేఎస్ అధ్యక్షులు రావుల వెంకయ్య, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి సంతాపం ప్రకటించారు. రాజేంద్రన్ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

రాష్ట్ర నేతల దిగ్భ్రాంతి

సీపీఎం కేరళ రాష్ట్ర కార్యదర్శి ఎంవీ గోవిందన్, ఉన్నత విద్యశాఖ మంత్రి ఆర్.బిందూ, లోకతాంత్రిక్ జనతా దళ్ (ఎల్‌జేడీ) అధ్యక్షులు, మాతృభూమి మేనేజింగ్ డైరెక్టర్ ఎంవీ శ్రేయమ్స్ కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

జనంలోకి చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

ఓదార్చేందుకు ప్రజల్లోకి వచ్చారు. చంద్రబాబు అరెస్ట్ వ్యవహారం తెలుగు తమ్ముళ్లను బాగా కుంగదీసినప్పటికీ ఆయన జైలుకి వెళ్లిన తర్వాత జనసేన అధినేత పవన్‌కల్యాణ్ టీడీపీతో ఎన్నికల పొత్తును అధికారికంగా ప్రకటించడం, చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ ప్రపంచవ్యాప్తంగా టీడీపీ సానుభూతిపరులు ఆందోళనలు చేయడం, ముఖ్యంగా తెలంగాణలో ఐటీ ఉద్యోగులు భారీ బహిరంగసభ, ర్యాలీ నిర్వహించి మద్దతు తెలియజేయటం వంటి పరిణామాలు టీడీపీ శ్రేణులకు ఊరట కల్గించాయి. చంద్రబాబు బెయిల్‌పై విడుదలైన తర్వాత రాజమహేంద్రవరం నుంచి ఉండవల్లి నివాసానికి చేరుకోవడానికి 14 గంటలు పట్టడం, ప్రజలు లక్షల సంఖ్యలో ఆయనకు బ్రహ్మరథం పట్టడం తెలుగుతమ్ముళ్లకు కొత్త ఉత్సాహాన్ని కల్గించింది. మరోవైపు చంద్రబాబు అరెస్ట్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కుమారుడు కేటీఆర్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యానాలు తెలంగాణ టీడీపీ కార్యకర్తలు, సానుభూతిపరులను తీవ్రంగా బాధించాయి. ఇది తెలంగాణలో కేసీఆర్ ఓటమిపై తీవ్ర ప్రభావం చూపిందని టీడీపీ శ్రేణులు వ్యాఖ్యానిస్తున్నాయి. మొదటిసారి మూడు నెలలపాటు ప్రజలకు దూరంగా ఉన్న చంద్రబాబు...మరలా కదనరంగంలోకి దూకారు. గుంటూరు జిల్లా వేమూరు నియోజకవర్గం అమృతలూరులో తుపాన్ కారణంగా నష్టపోయిన పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తెనాలి నియోజకవర్గంలో పెద్దమొత్తంలో దెబ్బతిన్న వరి, అరటి, మినుము, పెసర పైర్లను పరిశీలించి రైతులను ఓదార్చారు.

ప్రతి రైతును ఆదుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

పాలనలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చామన్నారు. వరద నీటితో నిండిన గ్రామాల్లో ప్రతి ఒక్కరినీ ఆదుకొనేందుకు రేషన్‌తో పాటు ప్రతి ఇంటికీ రూ.2,500 ఇచ్చిన చరిత్ర వైసీపీ ప్రభుత్వానిదేనని తెలిపారు. దాదాపు 12 వేల మందికి 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, లీటరు పామాయిల్, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళదుంపలు ఇవ్వడంతో పాటు ప్రతి ఇంటికీ రూ.2,500 ఇచ్చే కార్యక్రమం జరుగుతోందన్నారు.

చంద్రబాబు పాలనలో ఇచ్చింది కేవలం రూ.3,400 కోట్లే...

చంద్రబాబు పాలనలో 35 లక్షల మందికి కేవలం రూ.3,400 కోట్లు మాత్రమే ఇచ్చారని, వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనలో 55 లక్షల మందికి రూ.7,800 కోట్లు ఇచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు. ఏ సంవత్సరం అయినా ఈ ఖరీఫ్‌లో రైతన్న ఇబ్బంది పడితే, వచ్చే ఖరీఫ్ నాటికి పంట బీమా కచ్చితంగా వస్తోందని రైతులకు భరోసా ఇచ్చారు. గతంలో చంద్రబాబులాగా వరదలు, విపత్తులు సంభవించినప్పుడు హడావిడిగా పర్యటనల పేరుతో ఏదొక ప్రాంతానికి వెళ్లి అక్కడ ఫొటోలు దిగి రావడం వల్ల ఉపయోగం ఉండదని సీఎం జగన్ తెలిపారు. తాను మాత్రం తొలుత అధికారులకు విపత్తుకు సంబంధించి అనేక సూచనలు చేశానని అన్నారు. వారం తర్వాత కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో ఏ విధంగా పనిచేశారని ప్రజలను అడిగి తెలుసుకున్నట్లు వివరించారు. ఇంకా ఎవరికైనా సాయం చేయకపోతే వారికి కూడా మేలు జరిగేలా చూస్తానని సీఎం జగన్ చెప్పారు. ఫొటోలు దిగడం కంటే పనులు జరగడం గురించి తాను ఆలోచిస్తానన్నారు. ఈ పర్యటనలో సీఎం వెంట బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీలు మోపిదేవి వెంకటరమణ, నందిగం సురేష్ ఉన్నారు.

తిరుపతి జిల్లాలో సీఎం ఏరియల్ సర్వే

వర్షాలతో నష్టపోయిన ప్రతి ఒక్కరిని ఆదుకుంటామని సీఎం జగన్ భరోసా ఇచ్చారు. శుక్రవారం ఉదయం తిరుపతి జిల్లా పరిధిలో ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, మంత్రి వనిత, జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డితో కలిసి ఆయన ఏరియల్ సర్వే నిర్వహించారు. వాకాడు మండలం బాలిరెడ్డి పాలెం, కోట మండలం విద్యానగర్ చేరుకొని పంటలను పరిశీలించారు. తుపాను బాధితుల తో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వర్షాలతో రైతులకు జరిగిన నష్టం ఎంతో బాధించిందన్నారు. బాధితుల కోసం 92 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 8,362 మందిని కేంద్రాలకు తరలించి ఆదుకున్నట్లు చెప్పారు. వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లకు సంబంధించి దాదాపు 60 వేల మందికి 25 కేజీల బియ్యం కందిపప్పు, ఒక లీటరు పామాయిల్, బంగాళదుంప, ఉల్లిపాయలు అందించామన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన పట్టదా?

- ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రశ్న
- సత్యాగ్రహ దీక్షకు సీపీఎం, టీడీపీ సంఘీభావం

విశాలాంధ్ర-మంగళగిరి: అధికారంలోకి వస్తే అగ్రిగోల్డ్ బాధితులందరికీ పూర్తిగా డబ్బులు చెల్లిస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి...అధికారం చేపట్టాక విస్మరించారని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలో అంబేద్కర్ విగ్రహం వద్ద అగ్రిగోల్డ్ బాధితుల సత్యాగ్రహ దీక్షను శుక్రవారం ముప్పాళ్ల ప్రారంభించారు. ముప్పాళ్ల మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి మోసపూరిత వాగ్దానాలతో అందరినీ మోసం చేశారని, అగ్రిగోల్డ్ బాధితులను సైతం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వంపై నమ్మకం సడలి బాధితులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వెలిబుచ్చారు. తొమ్మిదేళ్ల నుంచి సీపీఐ అండతో అగ్రిగోల్డ్ బాధితులు శాంతియుత పోరాటాలు చేస్తున్నారని, మరణించిన బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున 142 కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇప్పించగలిగామని తెలిపారు. ప్రతిపక్ష నేతగా దీక్ష శిబిరానికి వచ్చిన జగన్... వారం రోజుల్లో రూ.1182 కోట్లను, ఆరు నెలల్లో మిగిలిన వారందరికీ వడ్డీతో సహా ఇస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అగ్రిగోల్డ్ బాధితుల ఓట్లతోనే అధికారంలోకి వచ్చిన విషయాన్ని జగన్ మర్చి పోరాదని హితవు పలికారు. 40 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులు రానున్న ఎన్నికలలో రాష్ట్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ముప్పాళ్ల హెచ్చరించారు. పేదల సంక్షేమం కోసం నవరత్నాలు ప్రకటించిన ముఖ్యమంత్రి...అగ్రిగోల్డ్ కంపెనీ చేతిలో మోసపోయిన బాధితుల సమస్యను పదోరత్నంగా భావించి మ్యానిఫెస్టోలో పెడతానని చెప్పి మోసగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌కు కేసీఆర్ గతిపట్టక తప్పదని స్పష్టంచేశారు. డిసెంబర్ 28, 29 తేదీలలో ఆత్మహత్యలు, అసహజ మరణాలు, గుండెపోటుకు గురై మరణించిన బాధితుల కుటుంబ సభ్యులతో 30 గంటల విమోచన దీక్షలు విజయవాడ ధర్నా చౌక్‌లో చేస్తామని ముప్పాళ్ల ప్రకటించారు. దీక్షలో బాధితులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రికి అందర్నీ మోసం చేయడం అలవాటుగా మారిందని విమర్శించారు. అగ్రిగోల్డ్ బాధితులను పట్టించుకోని జగన్...బటన్ నొక్కుతూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని మండిపడ్డారు. పేదల కష్టార్జితాన్ని కొల్లగొట్టిన అగ్రిగోల్డ్ కంపెనీ యాజమాన్యాన్ని ముఖ్యమంత్రి కాపాడుతున్నారన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులు మాట్లాడుతూ నమ్మకంతో అగ్రిగోల్డ్ సంస్థలో డిపాజిట్లు చేస్తే మోసం చేశారని, అవసరాలకు ఉపయోగపడతాయన్న ఆశతో తాము డిపాజిట్లు చేశామని చెప్పారు. తమను మోసగించిన అగ్రిగోల్డ్ కంపెనీ ఆర్థిక నేరగాళ్ల ఆస్తులు జప్తు చేసి...తమను ఆదుకోవాలని కోరారు. తమ తరపున సీపీఐ ముందుండి పోరాడుతోందని, ఫలితంగా కొంతమందికి డిపాజిట్లు దక్కాయని చెప్పారు. సీపీఎం, టీడీపీ నాయకులు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయలేని ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు ఏమి న్యాయం చేస్తారని ప్రశ్నించారు. అగ్రిగోల్డ్ యాజమాన్యాన్ని రక్షించడం కోసం జగన్ కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, ఏరియా మహిళాసమాఖ్య కార్యదర్శి గుడిమెట్ల శివకుమారి, నియోజకవర్గ అధ్యక్షురాలు కోట లలిత పద్మిని, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్, చక్రధర బాబు, పి.కృష్ణ, గౌరీశంకర్, భాస్కరరావు, వై.శివయ్య, రజనీబాల, అన్నవరపు ప్రభాకర్, నందం బ్రహ్మేశ్వరరావు, వెంకట్ రెడ్డి, జాలాది జాన్‌బాబు, తుడిమెళ్ల వెంకటయ్య, ఎస్‌కే కరీముల్లా, జవ్వాది సాంబశివరావు, గుంటక సాంబిరెడ్డి, ఎస్‌కే బాషా, సంధుపట్ల భూపతి, భావన సాంబశివరావు, కేఎస్ రాయన్న, బుర్ల శ్రీనివాస్‌రావు, బత్తూరి మోహనరావు, దాసరి బేబీ, గుడిమెట్ల శివకుమారి, మరియదాసు, ఎస్‌కే మదీనా, మునగాల రామారావు, మానికొండ దాంగే, కాబోతు ఈశ్వరరావు, బాపనపల్లి శ్రీనివాసరావు, గుర్రంకొండ సత్యానందం, హనోక్ బాబు, సీపీఎం నాయకులు జేవీ రాఘవులు, ఫకీరయ్య, ఎస్ఎస్ చెంగయ్య, గని, కమలాకర్, టీడీపీ నాయకులు గోవాడ దుర్గారావు, తోట పార్థసారథి, కనికల్ల చిరంజీవి, కారంపూడి అంకమ్మరావు, గోసాల రాఘవ, పడవల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు నాగరాజు మృతి

విశాలాంధ్ర-గన్నవరం: సీపీఐ గన్నవరం నియోజకవర్గ నాయకుడు ఎర్లగుంట్ల నాగరాజు (65) గుండె నొప్పితో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాగరాజు చిన్నతనం నుంచి సీపీఐలో చురుకుగా పని చేశారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్‌లు నాగరాజు మృతదేహంపై సీపీఐ జెండాను కప్పి, పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ నాగరాజు మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వెలగపూడి ఆజాద్, రైతు సంఘం నాయ కులు ముక్కమాల ఉమామహేశ్వరరావు, కార్యదర్శి పెద్దు వాసుదేవరావు, కార్యవర్గ సభ్యులు శనగల సుబ్బారెడ్డి, కాట్రగడ్డ రామచంద్ర జోషి, మంచికంటి సాంబయ్య, ఎన్.బాబూరావు, చాగంటిపాటి వెంకటేశ్వరావు, చాగంటిపాటి భవానీ ప్రసాద్‌లు నాగరాజు కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. సీపీఎం ఉంగుటూరు కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు, బీమావరపు సుబ్బారెడ్డి, చౌటపల్లి ప్రభాకర్, చౌటపల్లి రమేష్, చౌటపల్లి జాజి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

10న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర ప్రథమ మహాసభ

విజయవంతం చేయాలని ఏపీ జేఏసీ అమరావతి పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో ఈనెల 10వ తేదీ ఆదివారం జరగనున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ప్రథమ మహాసభను విజయవంతం చేయాలని ఏపీ జేఏసీ అమరావతి నేతలు పిలుపునిచ్చారు. విజయవాడ రెవెన్యూ భవన్‌లో శుక్రవారం ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.సుమన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏపీ జేఏసీ అమరావతి అనుబంధంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో రాష్ట్రస్థాయి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ప్రథమ మహాసభ జరుగుతుందని, ఈ మహాసభకు ఉద్యోగులందరూ విచ్చేసి జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ సంఘంగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. మహాసభ వేదికగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన సమస్యల సాధన కోసం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామన్నారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్రనాయకులు మురళీకృష్ణనాయుడు, బి.కిశోర్, సాంబశివరావు, వై.శ్రీనివాసరావుతోపాటు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నేతలు అల్లం సురేశ్, భానూజీరావు, అనిల్, మధు, గురునాథ్, శ్యామ్ ప్రసాద్, విలియం, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

నలంద కాలేజి గుర్తింపు రద్దు

- విద్యార్థి సంఘాల డిమాండ్
- ఇంటర్ బోర్డు కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన

విశాలాంధ్ర-విజయవాడ: విద్యార్థుల జీవితాలతో చెలగాటమడుతున్న నలంద జూనియర్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకునేవరకు పోరు ఆగబోదని హెచ్చరించాయి. నంద్యాల జిల్లాలో నలంద కళాశాల విద్యార్థులకు యాజమాన్యం శిరోముండనం చేయించడానికి నిరసనగా తాడేపల్లిలోని ఇంటర్మీడియేట్ బోర్డు కమిషనర్ కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాలు ఆందోళన చేశాయి. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయి కుమార్ మాట్లాడుతూ గుండు గీయిస్తే స్పందించలేదు... విద్యార్థులను చంపితే స్పందిస్తారా అని అధికారులను నిలదీశారు. కలెక్టర్ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఒక విద్యార్థి చేయి విరగొట్టిన నలంద జూనియర్ కళాశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా వసతి గృహం నడుపుతూ అధిక ఫీజులతో పాటు పరీక్ష ఫీజులను రెండింతలు వసూలు చేస్తోందని ఆరోపించారు. ఆర్ఐఓ, డీఐఈఓ, ఆర్‌జేడీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ ఘటనపై విచారణను తప్పుదోవ పట్టిస్తున్న ఆర్ఐఓ గురువయ్య శెట్టిని, డీఐఈఓ సునీతని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈఓఈ సుబ్బారావుకి వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధనుంజయుడు, ఏఐఎస్‌ఏ రాష్ట్ర కార్యదర్శి రాజునాయుడు, ఏఐఎస్‌ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున, పీడీఎస్‌యూ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు రఫీ, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి, ఏఐఎస్ఎఫ్ నాయకులు అయ్యప్ప, సుధీర్, జగదీశ్, రంజిత్, సురేశ్ పాల్గొన్నారు.

ఏపీ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ సొసైటీ నూతన చైర్మన్‌గా అనంత రామకృష్ణ ప్రసాద్ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్‌గా వి.అనంత రామకృష్ణ ప్రసాద్ (అమ్మ ప్రసాద్) ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడ గొల్లపూడి దేవాదాయ శాఖ భవన్‌లో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పేరి కామేశ్వరరావుతో పాటు విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగదేసి రవికుమార్, ఆంధ్ర ప్రదేశ్ సంక్షేమ బోర్డు సభ్యుడు పెద్దిపోగు కోటేశ్వరరావు, ఏపీ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ సీఈఓ జి.నాగసాయి, బ్రాహ్మణ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఎ.కుమారస్వామి తదితరులు హాజరై అనంత రామకృష్ణ ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో అనంత రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ సంస్థకు చైర్మన్‌గా నియమించిన సీఎం జగన్‌కు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యకు సొసైటీ ద్వారా విద్యా రుణాలు మంజూరుకు భారతి విద్యా రుణం పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరపున భారతి విద్యా రుణాన్ని అర్హులైన విద్యార్థులకు మంజూరు చేస్తామని చెప్పారు. భారతి విద్యా రుణం పథకం ఫైల్‌పై చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మొదటి సంతకం చేశానన్నారు. రాష్ట్రంలోని బ్రాహ్మణులను గుర్తించి బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో రెండు లక్షల మంది సభ్యులయ్యేలా కృషి చేస్తానని తెలిపారు.

28 నుంచి పుస్తక మహోత్సవం

- 11 రోజుల పాటు నిర్వహణ
- జనవరి 1న పుస్తక ప్రియుల పాదయాత్ర
- ప్రారంభోత్సవ సభకు గవర్నర్ నజీర్, మంత్రి బొత్స

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్: విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్వర్యంలో 34వ పుస్తక మహోత్సవం ఈనెల 28 నుంచి 2024 జనవరి 7వ తేదీ వరకు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు మహోత్సవ కన్వీనర్ ఎమెస్కో విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం సొసైటీ భవనం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 28వ తేదీ సాయంత్రం 6 గంటలకు జరిగే ప్రారంభోత్సవ సభకు ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పుస్తక మహోత్సవ ప్రాంగణానికి వరహాల చెట్టి, (బుక్ సెంటర్, విశాఖపట్నం) పేరు, అలాగే ప్రధాన వేదికకు ప్రసిద్ధ రచయిత కేతు విశ్వనాథరెడ్డి పేరు, విద్యార్థుల కార్యక్రమాలు నిర్వహించే ప్రతిభా వేదికకు శ్రీరమణ పేర్లను పెట్టామన్నారు. ప్రారంభోత్సవ సభానంతరం వరహాల చెట్టి సంస్మరణ సభ జరుగుతుందని, 29వ తేదీన ఆవంత్స సోమసుందర్ శత జయంతి సభ, 30న భారతదేశ జనాభా-సమస్యలు పుస్తక ఆవిష్కరణ సభ, 31న కాళీపట్నం రామారావు శత జయంతి సభ జరుగుతాయన్నారు. జనవరి 1వ తేదీ సాయంత్రం 4 గంటలకు పుస్తక ప్రియుల పాదయాత్ర సిద్ధార్థ కళాశాల ప్రాంగణం నుంచి ప్రారంభమై పుస్తక మహోత్సవ ప్రాంగణంలోని ప్రధాన వేదికకు చేరుకుంటుందని వివరించారు. తదుపరి ప్రధాన వేదికపై ఎమెస్కో వారి పుస్తకావిష్కరణ ఉంటుందని తెలిపారు. జనవరి 2న సంజీవ్ దేవ్ శత జయంతి సభ జరుగుతుందని, 6న చాగంటి కోటేశ్వరరావు మహాభారత ప్రవచనాలు ఆవిష్కరణ సభ జరుగుతుందని, 7వ తేదీన సమాపనోత్సవ సభ జరుగుతుందన్నారు. ఈ సభకు రాష్ట్ర సాంకతిక విద్యా కమిషనర్ నాగరాణి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీ రావు, విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పాల్గొంటారని తెలిపారు. మరిన్ని పుస్తకావిష్కరణ కార్యక్రమాలు, ప్రసంగాలు ప్రధాన వేదికపై జరుగుతాయన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు మనోహర్ నాయుడు మాట్లాడుతూ పుస్తక మహోత్సవ ఏర్పాటుకు, విజయవంతం కావటానికి సహకరిస్తున్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పుస్తక మహోత్సవంలో చిన్నారులలోని సృజనాత్మకతను పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన మరొక వేదికపై ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పుస్తకం మహోత్సవం 11 రోజులలో పిల్లల కార్యక్రమాలు రూపొందించామని, 29న కథ చెప్పండి, 30న కార్టూన్లు, చిత్రలేఖనం, 31న వ్యాసరచన, 1న వక్తృత్వ పోటీ, 2న పద్యాలు, 3న జీవన నైపుణ్యాలు, 4న క్రాఫ్ట్స్, 5న పైకి చదవడం, 6న కథ రాయటం వంటి అంశాలతో పిల్లలలో ఉన్న ప్రతిభను ప్రదర్శించడానికి ప్రతిభా వేదిక వారికి వేదిక కల్పిస్తూ ప్రోత్సాహాన్ని, తోడ్పాటునందిస్తుందని వివరించారు. వీటి కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యం అందరూ సహకరించి పిల్లలను, విద్యార్థులను ఈ కార్యక్రమాలకు తీసుకురావాలని కోరారు. ఈనెల 23లోగా పోటీలలో పాల్గొన్నవారు వారి వారి దరఖాస్తులను పంపాలని, దరఖాస్తులను పరిశీలించి ఎంపిక చేసిన వారందరికీ అవకాశమిస్తామని తెలిపారు. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ఈ పోటీలలో పాల్గొనవచ్చన్నారు. ఈ కార్యక్రమం పూర్తయిన వెంటనే సర్టిఫికెట్‌తో పాటు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో సొసైటీ కార్యదర్శి లక్ష్మయ్య, గౌరవాధ్యక్షులు బెల్లపు బాబ్జి, కోశాధికారి రవి, సభ్యులు గోళ్ల నారాయణరావు పాల్గొన్నారు.

14న మంత్రివర్గ సమావేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఈనెల 11వ తేదీ జరగాల్సిన ఏపీ మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. ఈనెల 14వ తేదీకి కేబినెట్ సమావేశం వాయిదా వేస్తూ సీఎస్ కార్యాలయం నోట్ విడుదల చేసింది. డిసెంబరు 14న ఉదయం 11గంటలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన మంత్రిమండలి భేటీ అవుతుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. 12వ తేదీ సాయంత్రం 4గంటల్లోగా ప్రతిపాదిత అంశాలు పంపించాలని ఆయా శాఖల కార్యదర్శులను ప్రభుత్వ ప్రధానకార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి ఆదేశించారు.

ఉద్యోగులకు జీతాలివ్వాలి

ఏపీటీఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనర్లకు నవంబరు నెల వేతనాలు తక్షణమే చెల్లించాలని ఏపీటీఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి ఒక ప్రకటన విడుదల చేశారు. డిసెంబరు 8వ తేదీ దాటినా సగం మంది ఉద్యోగులకు జీతాలు అందలేదన్నారు. ప్రతి నెలా సకాలంలో జీతాలు, పింఛన్ రాక వారంతా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

పండుగలున్న నెలల్లోనూ వేతనాలు ఆలస్యం కావడం వల్ల పండుగ సంతోషాన్ని, వాతావరణాన్ని కోల్పోతున్నారన్నారు. దరఖాస్తు చేసుకున్న పీఎఫ్, ఏపీ జీఎల్ఐ, ఆర్జిత సెలవులు తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు.

మత్స్యకారులకు అండగా ఉంటాం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఫిషింగ్ హార్బర్ అగ్నిప్రమాద ఘటన దురదృష్టకరమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అన్నారు. విశాఖలో శుక్రవారం టీడీపీ కార్యాలయంలో బాధిత మత్స్యకారులకు పరిహారం అందజేశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడుతూ అధికారంలో ఉన్నా లేకపోయినా మత్స్యకారులను ఎప్పుడూ ఆదుకునేది టీడీపీయే అన్నారు. బోట్లు కాలిపోయిన వారికి లక్ష రూపాయలు, పాక్షికంగా బోట్లు కాలిపోయిన వారికి రూ.50 వేలు అందించామని, జీవనోపాధి కోల్పోయిన బాధితులను ఆదుకుంటామని తెలిపారు. బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అగ్ని ప్రమాదం ఘటనపై మొదట స్పందించి ఆర్థిక సహాయం చేసింది జనసేన పార్టీనే అన్నారు. టీడీపీ-జనసేన ఒక్కటయ్యాయని, ఈ రెండు పార్టీలను ప్రజలు ఆదరించాలన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా టీడీపీ-జనసేన అధికారంలోకి వస్తాయని, అప్పుడు బాధితులకు కొత్త బోట్లు కొనిస్తామని చెప్పారు. పేరుకే కార్పొరేషన్లు అని, ఒక్క రుణం కూడా ఇవ్వలేదని, వీటివలన ఎవరికీ ఉపయోగం లేదని అచ్చెన్నాయుడు తెలిపారు. 50 ఏళ్లకే మత్స్యకారులకు పెన్షన్ ఇచ్చిన ఘనత టీడీపీదన్నారు. తుపాను బాధితులను చంద్రబాబు పరామర్శిస్తుంటే, జగన్ ఇప్పుడు నిద్ర లేచాడన్నారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ విశాఖలో ఫిషింగ్ హార్బర్ ఘటన ప్రభుత్వ వైఫల్యం వల్లే జరిగిందన్నారు. ఆయిల్ ధర 27 రూపాయలు ఉన్నప్పుడు మూడు రూపాయల సబ్సిడీ ఇచ్చిన ఘనత టీడీపీదే అని తెలిపారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఎన్టీఆర్ హయాం నుంచి మత్స్యకారుల అభివృద్ధికి టీడీపీ కృషి చేస్తోందన్నారు. అధికారంలో ఉన్న వైసీపీకి ఒక్క రూపాయి ఇవ్వడానికి చేతులు రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, టీడీపీ పార్లమెంట్ ఇన్‌ఛార్జ్ ఎం.శ్రీభరత్, టీడీపీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవి రావు, దువ్వారపు రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ కోరాడ రాజబాబు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్, తెలుగు యువత నగర అధ్యక్షుడు తాతాజీ, అనుబంధ సంఘాల అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గ్రూప్, డీఎస్సీ ఉద్యోగాల వయోపరిమితి

47 ఏళ్లకు పెంచాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఏపీపీఎస్సీ ద్వారా ప్రకటించిన గ్రూప్ 1, గ్రూప్ 2 ఉద్యోగాలతో పాటు రాబోయే మెగా డీఎస్సీ పోస్టులకు దరఖాస్తు చేసేందుకుగాను ప్రస్తుతమున్న జనరల్ అభ్యర్థుల వయోపరిమితిని 42 సంవత్సరాల నుంచి 47 కు ప్రభుత్వం పెంచాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఏపీపీఎస్సీ ద్వారా ప్రభుత్వం విడుదల చేసిన ఖాళీలలో గ్రూప్ 2 కు 897, గ్రూప్ 1 ఉద్యోగాలు 81 మాత్రమే ఉన్నాయని, ఈ సంఖ్య సరిపోబోదని తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య నాలుగు లక్షలకు దాటిందని, దక్షిణ పోస్టుల సంఖ్యను పెంచాలని కోరారు. రాబోయే డీఎస్సీ పోస్టులకు కూడా జనరల్ అభ్యర్థులకు వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్ ప్రభుత్వం హయాంలో నాలుగు సంవత్సరాల ఎనిమిది నెలల వరకు ఉద్యోగాల ప్రకటనలు సరిగ్గా లేవన్నారు. దీంతో లక్షల మంది నిరుద్యోగ యువతకు వయోపరిమితి మించిపోయి, గ్రూప్ 1, గ్రూప్ 2 పోస్టులతోపాటు రాబోయే మెగా డీఎస్సీ ఉద్యోగాలకు అనర్హులవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే డీఎస్సీ ప్రకటన విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కానిస్టేబుల్ రాత పరీక్షలోని ప్రశ్నల లోపాలను గుర్తించి, ఒక గ్రేస్ మార్కులు వేసి అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు.

కాశీలో మండపేట వాసుల బలవన్మరణం

ఒకే కుటుంబంలో నలుగురు ఉరేసుకుని ఆత్మహత్య

విశాలాంధ్ర-మండపేట: ఉత్తర ప్రదేశ్‌లోని కాశీలో ఏపీకి చెందిన నలుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆ నలుగురు ఒకే కుటుంబానికి చెందిన తెలుగు వారు అని, ఆంధ్ర ప్రదేశ్‌లోని అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట వాసులుగా యూపీ పోలీసులు ధ్రువీకరించారు. ఈ మేరకు తమకు సమాచారం అందజేశారని మండపేట టౌన్ ఎస్ఐ మద్దాల అశోక్ తెలిపారు. యూపీ పోలీసులు అందించిన వివరాల ఆధారంగా మండపేటలో కేసు దర్యాప్తు చేపట్టి పూర్తి సమాచారం సేకరిస్తున్నామన్నారు. ఈ కేసుకు సంబంధించి టౌన్ ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ఇటీవల కాశీ తీర్థ యాత్రకు వెళ్లారు. అక్కడ ఓ కాటేజీ అద్దెకు తీసుకుని నలుగురు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోగా గురువారం సాయంత్రం హౌస్ కీపర్ చూసి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. దానిపై పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతుల ఆచూకీని, ఆత్మహత్యకు గల కారణాలు కనుగొన్నారు. అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిసిందన్నారు. మృతులు పట్టణానికి చెందిన కొండబాబు (50), లావణ్య (45), రాజేష్ (25), జయరాజ్ (23) గా వెల్లడించారు. భార్యాభర్తలిద్దరితో పాటు మిగిలిన ఇద్దరు వారి కుమారులుగా గుర్తించారు. దీనిపై ఇక్కడ విచారణ చేపట్టి దర్యాప్తు వేగవంతం చేస్తున్నామని చెప్పారు. కాగా ఈ కుటుంబం గతంలో అడ్డతీగల నుంచి మండపేట వలస వచ్చారు. కొన్నాళ్లు కాకినాడలో కూడా జీవించినట్టు తెలిసింది. కుటుంబ పెద్ద కొండబాబు బైక్ మెకానిక్‌గా రెండు మూడు షో రూమ్‌లలో పని చేశాడు. కొన్నాళ్లుగా సొంతంగా మెకానిక్ షెడ్ నిర్వహిస్తున్నారు. వీరిలో ఓ కుమారుడు ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తూ అక్కడ మతలబు చేసి కొంత సొమ్ము సొంతానికి వాడుకున్నట్టు తెలుస్తోంది. ఫైనాన్స్ కంపెనీ నిర్వాహకులకు తెలియకుండా నకిలీ బిల్లు బుక్‌లు ముద్రించి కస్టమర్ల నుంచి లక్షల్లో సొమ్ములు కాజేసినట్టు వినికిడి. అయితే జరిగిన మోసం బయట పడి ఫైనాన్షియర్లు రికవరీకి ఒత్తిడి తీసుకురావడంతో చేసేది లేక గత మూడు నెలలుగా అద్దె ఇంటికి తాళాలు వేసి తీర్థ యాత్రల పేరుతో ఇతర ప్రాంతాలు తిరుగుతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో గురువారం ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసి దశాశ్వమేధ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆంధ్రా ఆశ్రమంలోని కైలాష్ భవన్‌లో దంపతుల ఇద్దరు కుమారులతో సహా ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన పట్టణంలో చర్చనీయాంశమైంది.

ఏపీ అభివృద్ధి కోసం ప్రజా ప్రణాళికతో వెళ్తాం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అసమానతలు లేని ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి కోసం ప్రజా ప్రణాళికతో ప్రజల్లోకి వెళ్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు వెల్లడించారు. వివిధ రంగాల మేధావులు, ప్రముఖులతో విజయవాడలో ప్రజా ప్రణాళికపై సీపీఎం సమాలోచన కార్యక్రమాన్ని నిర్వహించింది. శ్రీనివాసరావు మాట్లాడుతూ, సీపీఎం స్వతంత్ర పునాది విస్తరణకు కృషి చేస్తామన్నారు. వామపక్ష, ప్రజాతంత్ర శక్తులతో కలసి పని చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానాలతో రవాణా, నిర్మాణ, పాఠశాల విద్య రంగాలు కుదేలవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కే ఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ, అభివృద్ధి-సంక్షేమం సమపాళ్ళల్లో ప్రజలకు అందాలన్నారు. కమ్యూనిస్టులు బలపడాలని కోరారు.

సంపాదకీయం

విచారణకు ముందే ఖరారైన శిక్ష

శిక్ష ముందే ఖరారైన తరవాత సాక్షులను విచారించడం, వాదోపవాదాలు జరగడం వృథా ప్రయాస అని ఇసుమంత "ఇంగిత జ్ఞానం" ఉన్న వారికైనా తెలుస్తుంది. అలాంటి "ఇంగిత జ్ఞానం" లోకసభ స్పీకర్ ఓం బిర్లాకు అపారంగా ఉన్నందువల్లే తృణమూల్ కాంగ్రెస్ సభ్యురాలిని సభ నుంచి బహిష్కరించేసి ఓ పని అయిందనిపించారు. మహువా మొయిత్రా లోకసభలో ప్రశ్నలు అడగడానికి డబ్బు తీసుకున్నారని బీజేపీ సభ్యుడు నిశికాంత్ దుబే ఆరోపించారు. ఆ తరవాత మహువా మొయిత్రా వ్యవహారంపై దర్యాప్తు చేసే బాధ్యత పార్లమెంటు నైతిక విలువల కమిటీకి అప్పగించారు. ఈ కమిటీ విచారణలో ఏం జరిగింది, కమిటీ అధ్యక్షుడు వినోద్ కుమార్ సోంకర్ వ్యవహారం ఎలా ఉంది అన్న అంశాలపై చాలా చర్చించవచ్చు. దర్శన్ హీరనందానీని ఎదురు ప్రశ్నలు వేసే అవకాశం కూడా మొయిత్రాకు ఇవ్వలేదు. ఈ తతంగం అంతా జరిగిన తరవాత శుక్రవారం మహువా మొయిత్రాను మొదటి నుంచి ఊహిస్తున్నట్టుగానే లోకసభ నుంచి బహిష్కరించేశారు. ఈ అంశం మీద చర్చ జరిగేటప్పుడు ఆమెకు మాట్లాడే అవకాశమే ఇవ్వలేదు. మరణ శిక్ష అమలు చేసేటప్పుడు కూడా నేరస్థుడని తేలిన వ్యక్తిని నీ ఆఖరు కోరిక ఏమిటి అని అడుగుతారు. కానీ బీజేపీ హయాంలో సభాధ్యక్షులు సైతం ప్రభుత్వం కనుసన్నల్లోనే మెలగుతుంటారు. అందుకే శిక్ష ముందే ఖరారైనప్పుడు విచారణ అవసరం ఏమిటి అనడం.

అదానీ మీద అదే పనిగా ప్రశ్నలు లేవనెత్తుతున్నందుకు రాహుల్ గాంధీ సభలో ఉండడం భరించలేక రాహుల్ గాంధీ 2019లో కర్నాటకలో చేసిన ఎన్నికల ప్రచార సభలో మాటలను పోగేసి గుజరాత్ కోర్టులో కేసు దాఖలు చేయించి, కొన్నాళ్లు ఆ వ్యవహారంపై విచారణ నిలిపివేసి ఆ తరవాత అనువైనప్పుడు హుటాహుటిన విచారణ అయిందనిపించి రాహుల్‌ను దోషిగా తేల్చారు. ఇరవై నాలుగు గంటలు తిరగకుండానే లోకసభ సచివాలయం రాహుల్ లోకసభ సభ్యత్వం రద్దయిందని అధికారికంగా ప్రకటించింది. తరవాత అత్యున్నత న్యాయస్థానం జోక్యంతో రాహుల్ సభ్యత్వం పునరుద్ధరించారు. రాహుల్ గాంధీలాగే మహువా మొయిత్రా కూడా అదానీని లోకసభలో నిరంతరం బోనెక్కించే వారు. ఆమెను మాత్రం మోదీ ఎలా సహించగలరు? నిశికాంత్ దుబేను పురమాయించి లోకసభలో ప్రశ్నలడగడానికి మొయిత్రా డబ్బు తీసుకుంటున్నారన్న ఆరోపణ చేయించారు. దీనికోసం ఆమె మిత్రుడు దర్శన్ హీరనందానీనే పావుగా వినియోగించుకున్నారు. హీరనందానీ కూడా వ్యాపారవేత్త అయినందువల్ల అదానీ ఆయనకు పోటీదారు కనక ఆయనే లోకసభలో అడగవలసిన ప్రశ్నలు తయారు చేసి పంపించే వారన్నది మొయిత్రా మీద అసలు ఆరోపణ. ఈ ప్రశ్నలు తయారు చేసి పంపడానికి మొయిత్రా తన పార్లమెంటు వెబ్ సైట్ ను ఉపయోగించుకోవడానికి పాస్‌వర్డ్ గట్రా సమాచారం హీరనందానికి అందించారని ఆరోపించారు. ఆ మాటను మహువా అంగీకరించారు. లోకసభలో అడగాల్సిన ప్రశ్నలు తయారు చేయడానికి హీరనందాని కార్యాలయం సహాయం తీసుకున్నానని ఆమె ఒప్పేసుకున్నారు. ఇందులో ఉచితానుచితాలను ఎంతైనా చర్చించవచ్చు. కానీ పార్లమెంటులో సభ్యులు అడిగే ప్రశ్నలన్నీ వారి బుర్రలో పుట్టినవే అయి ఉండకపోవచ్చు. అనేక పద్ధతుల్లో వారు ప్రశ్నలడగడానికి సమాచారం అందుకోవచ్చు. గుమాస్తా పని చేసిపెట్టడానికి ఎవరి సహాయమో తీసుకోవచ్చు. పైగా మొయిత్రా ఈ విషయాన్ని దాచి పెట్టిందీ లేదు.

నైతిక కమిటీలో జరిగిన విచారణ చూస్తే విచారణ ఎలా జరగకూడదో అన్న దానికి నిదర్శనంగా ఉంది. హీరనందానీని, దేహద్ రాయ్ ని పిలిచి తాను ఎదురు ప్రశ్నించడానికి అవకాశం ఇవ్వాలని మొయిత్రా చేసిన విజ్ఞప్తిని నైతిక కమిటీ అసలు పరిగణించనే లేదు. మహువా మొయిత్రాను అడగ కూడని వ్యక్తిగత ప్రశ్నలు అడిగారు. మీరు దుబై వెళ్లినప్పుడు ఏ హోటల్లో ఉన్నారు, మీతో పాటు ఎవరు ఉన్నారు అని ఒక మహిళను అడగకూడని అమర్యాదకరమైన ప్రశ్నలు అడిగి నైతిక కమిటీ నైతికత ఏ పాటిదో ఆ కమిటీ అధ్యక్షుడు వినోద్ కుమార్ సోంకర్ నిరూపించారు. ఆయనా బీజేపీ సభ్యుడే. ఆ కమిటీ అడగకూడని ప్రశ్నలు అడిగినందుకు మహువా మొయిత్రా ఆ విచారణ తంతు నుంచి బయటకు వచ్చేశారు. అంతేకాదు ఆ కమిటీలోని ప్రతిపక్ష సభ్యులూ బయటకు వచ్చేశారు. జరిగిన విచారణ వెనక బీజేపీ రాజకీయాలున్నాయని విచారణ తంతును, ప్రతిపక్ష సభ్యులు విచారణను బహిష్కరించడం చూస్తే అర్థం అవుతుంది. ఆ కమిటీ కష్టపడి 104 పేజీల నివేదిక తయారు చేసింది. ఆ నివేదికను గత నాల్గవ తేదీననే పార్లమెంటుకు సమర్పించాల్సింది. కానీ శుక్రవారం సమర్పించారు. పొద్దున అందజేశారు, మధ్యాహ్నం చర్చ అన్నారు. పార్లమెంటు సభ్యులు ఆ నివేదికను చదివే అవకాశమైనా ఇవ్వలేదు. అంటే లోకసభలో కూడా మొయిత్రాను బహిష్కరించాలని ముందే నిర్ణయించుకున్నారన్న మాట. ఆమెకు మాట్లాడే అవకాశమే ఇవ్వక పోవడం కరడుగట్టిన రాచరికాల్లో కూడా అనుసరించే పద్ధతి కాదేమో! విచారించి నివేదిక అందించే అవకాశం నైతిక విలువల కమిటీకి ఉంది. శిక్షించవచ్చో లేదో చెప్పొచ్చు తప్ప శిక్ష ఏమిటో నిర్ధారించే అధికారం లేదు. కాని ఆ కమిటీ తన పరిధిలోలేని పని చేసేసింది. అంటే ఒక న్యాయస్థానం చేయవలసిన పని చేసింది. తూతూ మంత్రంగా నైతిక విలువల కమిటీ నిర్వహించిన విచారణ మొయిత్రా "అనైతికంగా" ప్రవర్తించారని, "సభా ధిక్కారానికి" పాల్పడ్డారని తేల్చింది.

ఆమె పాస్‌వర్డ్ మొదలైనవి ఇతరులకు తెలియజేయడం సభా ధిక్కారం అని తేల్చారు. ఆ మాట నిజమే అనుకున్నా ఈ అంశాన్ని విచా రించాల్సింది నైతిక కమిటీనా, సభా ధిక్కార కమిటీనా?, నైతిక కమిటీయే సభా హక్కుల కమిటీ బాధ్యతలూ చేపట్టేసిందా? సభలో నైతిక ప్రమాణాలు పెంపొందించవలసిన కమిటీ అనుచితంగా ప్రవర్తిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. పార్లమెంటులో సభ్యులను నోరు మెదప నివ్వడం లేదు. నైతిక కమిటీ అధికారపక్షం చేతిలో పదునైన ఆయుధంగా మారిపోయింది. మొయిత్రాను లోకసభ నుంచి బహిష్కరించిన తరవాత కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ, బీఎస్పీ నాయకుడు దానిష్ అలీ ఆమె వెంటే బయటకు రావడం ప్రతిపక్షాల ఐక్యతకు నిదర్శనం. మొయిత్రాకు ప్రతిపక్షం మద్దతు ఇస్తుంది అని సోనియా ప్రకటించారు. సభ్యులు అనుచితంగా ప్రవర్తించినప్పుడు సభ నుంచి సస్పెండ్ చేయడం కొత్త కాదు. అనుచితంగా ప్రవర్తించింది అధికార పక్ష సభ్యులా, ప్రతిపక్ష సభ్యులా అన్న దానితో నిమిత్తం లేదు. కానీ ఎన్.డి.ఎ. హయాంలో ఉన్నన్ని సస్పెన్షన్లు మునుపెన్నడూ లేవు. 2014 నుంచి ఇప్పటివరకు 81 మందిని సస్పెండ్ చేశారు. వీరిలో ఒక్కరు కూడా బీజేపీ సభ్యుడు లేరు. అంతే కాదు బీజేపీకి మిత్రపక్షంగా ఉన్న అన్నాడిఎంకె సభ్యులు, బీజేపీకి అండగా ఉండే తెలుగు దేశం పార్టీ వారూ లేరు.

మానవాభివృద్ధిలో కార్మికుల కీలకపాత్ర

డా॥ బీకే కాంగో

మానవాభివృద్ధిలో కార్మికవర్గం చాలా ప్రముఖ పాత్ర వహించింది. మానవాభివృద్ధి క్రమంలో భారత స్వాతంత్ర్య పోరాటం అత్యంత కీలకఘట్టం. ప్రజల కేంద్రీకరణతో సాధికారతను సాధించేందుకు కార్మికవర్గం చేసిన పోరాటం ఎంతగానో దోహదం చేసింది. 21వ శతాబ్దిలో రెండు నమూనాల అభివృద్ధి ఉన్నది. ఒకటి జీడీపీ ఇది పూర్తిగా అభివృద్ధి నమూనా. ఉత్పాదకత పెరుగుదల, లాభం (ఆర్థిక వృద్ధి ప్రముఖమైనది). రెండోది మానవాభివృద్ధి సూచిక. అభివృద్ధి లేదా పురోగతి ఆధారంగా ఉండాలి. 20వ శతాబ్ది ప్రారంభంలో మానవాభివృద్ధి నమూనా ప్రముఖ దశకు చేరింది. కార్మికవర్గ పోరాటమే ఈ స్థాయికి తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య పోరాటానికి ముందు, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కార్మికవర్గం దోహదం చేసిన కృషిని తప్పనిసరిగా విశ్లేషించాలి. స్వాతంత్ర్య పోరాటంలోనూ వలసవాదం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడుతూనే ఉన్నది. భారతదేశం అంటేనే కార్మికవర్గం ప్రధాన పాత్ర వహిస్తుందని గుర్తింపు పొందింది. స్వాతంత్ర్యం అంటే కార్మికవర్గం బ్రిటీష్ పాలకుల నుంచి అధికారాన్ని భారతీయులకు అప్పగించడం మాత్రమే కాదు. దేశ ప్రజలు అన్ని రంగాలలోనూ సాధికారత సాధించడం కూడా. స్వాతంత్ర్యానికి ముందు, ఆ తరువాత కార్మికవర్గం తన పోరాటాన్ని కొనసాగిస్తూనే అభివృద్ధిలో కీలకపాత్ర వహిస్తోంది.

సామ్రాజ్యవాదాన్ని ఓడించేందుకు భారతదేశానికి స్వాతంత్ర్యం అవసరం. అలాగే మానవహక్కులు, సమానత్వం లాంటి సూత్రాల ఆధారంగా ప్రజాస్వామ్య సమాజం ద్వారా ప్రజలకు సాధికారత తీసుకురావడం కార్మికవర్గ పాత్రను తెలియజేస్తుంది. భారతదేశం ప్రజాస్వామ్య, సెక్యులర్, సోషలిస్టు తరహా దేశమైంది. ఆర్థికవాదంలో కార్మికవర్గం చిక్కుకుపోయింది. ఈ అభివృద్ధిలో కార్మికవర్గం చోటుచేసుకోలేదు. అధికారం అంటే కేవలం రాజకీయ అధికారం కాదు. ఆరోగ్యం, కులం, మతం, వారసత్వం ఇతర హక్కులు ఇమిడివున్నాయి. ఆర్థిక, రాజకీయ పోరాటాలు, హక్కులు, పాలకవర్గం దాడులపై నిరంతరం పోరాడాలి. వీటన్నింటి కోసం కార్మికవర్గం పోరాడుతూనే ఉన్నది. ముఖ్యంగా న్యాయం కోసం ఉద్యమాలు నిర్వహిస్తున్నది. భారతదేశ పౌరులుగా కార్మికులు నిర్వహించిన పాత్రను తప్పనిసరిగా విశ్లేషించాలి. మొదటి దశలో కార్మికవర్గం ఫ్యాక్టరీ చట్టాలు, పనిగంటల తగ్గింపు, వారాంతపు సెలవులు, బాలకార్మికుల నిరోధంలాంటి సమస్యలపై పోరాడారు. మతము, కులం, భాషలాంటి అంశాలతో నిమిత్తంలేకుండా సంఘటితరంగ కార్మికులు కలసికట్టుగా పోరాడారు. మార్క్సిజం ప్రభావాన్ని స్వీకరించి, మహాత్మాగాంధీ, పూలే (మహారాష్ట్రలో), ఎన్ఎం లోక్‌నాథ, షాపూర్‌జీ 1880 ప్రాంతంలో జౌళి కార్మికులను సమీకరించి ఫ్యాక్టరీ చట్టాన్ని సవరించాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. కార్మిక ఉద్యమాలు రాజ్యాంగాన్ని ఏర్పాటుచేసుకోవడమే గొప్ప విజయం.

సమస్యల పట్ల అవగాహన పెంచుకున్న కార్మికవర్గం ముందుగా పోరాటాన్ని నిర్వహించింది. బాలగంగాధర తిలక్‌ను 1907లో అరెస్టు చేసి, జైలుకు పంపాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అప్పుడు కార్మికవర్గం బొంబాయిలో ఆరు రోజులపాటు సమ్మె చేసింది. లెనిన్ ఈ అంశాన్ని గురించి భారత కార్మికవర్గంలో చైతన్యం పెంపొందించిందని, సాధ్యంకాదనుకున్న బ్రిటీష్ పాలకులను పారద్రోలి స్వాతంత్ర్యం పొందేందుకు దోహదంచేసిందని అన్నారు. 1917లో మహత్తర అక్టోబర్ విప్లవాన్ని రష్యాలో లెనిన్ నాయకత్వంలో సాధించారు. ప్రపంచమంతటా కార్మికులు ఈ సందర్భంగా చైతన్యవంతులయ్యారు. భారతదేశంలోని కార్మికవర్గం కూడా చైతన్యం పొందింది. ఆ నాటి నుంచి కార్మికులందరినీ సమీకరించి యూనియన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మొట్టమొదట కార్మికవర్గం మొదటి జాతీయ యూనియన్‌ను ఏర్పాటు చేశారు. అదే ఆల్ ఇండియా ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ). ఈ యూనియన్ 1920 అక్టోబర్ 31న బొంబాయిలో ఏర్పాటైంది. ఆ నాటి నుంచి ఏఐటీయూసీ సోషలిజంకోసం పోరాడింది. జాతీయ స్వాతంత్ర్య పోరాటంలో భాగమైంది. 1921లో రెండవ మహాసభ జరియాలో నిర్వహించారు. బ్రిటీష్ పాలకుల నుంచి సంపూర్ణ స్వాతంత్ర్యం ప్రకటించాలని ఏఐటీయూసీ తీర్మానం చేసింది. అప్పటి వరకు కాంగ్రెస్ ప్రజాఉద్యమం ద్వారా కేవలం స్వయంపాలనకు డిమాండ్ చేసింది. సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం మాట్లాడలేదు. 1921 నుంచి 1929 వరకు కాంగ్రెస్ మహాసభలు నిర్వహించిన చోటల్లా ఏఐటీయూసీ ప్రదర్శనలు చేసింది. అనంతరమే కాంగ్రెస్ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం తీర్మానం చేసింది. లాహోరులో జరిగిన ఏఐటీయూసీ మహాసభలో సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం తీర్మానించారు. 1929లో లాహోర్‌లో జరిగిన మహాసభలో పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షులయ్యారు.

అనంతరం కార్మికవర్గం ఉత్సాహంతో ప్రధానమైన పోరాటాలన్నింటిలోనూ పాల్గొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం కార్మికులు, ట్రేడ్‌యూనియన్లు ఎన్నో త్యాగాలు చేశాయి. స్వదేశీ ఉద్యమంలో బొంబాయికి చెందిన మిల్లు కార్మికులు బాబు జను ప్రాణత్యాగం చేశారు. అలాగే, 1946లో అన్ని ఓడరేవులలోనూ సమ్మె చేసిన నావికాదళాలు చేసిన స్వాతంత్ర్య పోరాటానికి కార్మికవర్గం మొత్తంగా మద్దతు తెలిపింది. బొంబాయి నర్సింగ్ ఫెడరేషన్ నాయకులు కమల్ దాండే, విమల్ రణదీవే తీవ్రంగా గాయపడ్డారు. ఈ సందర్భంగా పోలీసు కాల్పులలో కమల్ దాండే మృతిచెందారు. నావికా దళాలు, కార్మికులు కలిసి స్వాతంత్ర్యం కోసం పోరాడారు. స్వాతంత్ర్యం తరువాత ప్రపంచం మొత్తం ఒకటి సామ్రాజ్యవాద దేశం యూఎస్ఏ నాయకత్వంలో , మరొకటి సోషలిస్టు దేశం సోవియట్ యూనియన్ నాయకత్వంలో రెండు భాగాలు రెండు ప్రధాన భాగాలుగా విడిపోయింది. కార్మికవర్గం పైన సోషలిస్టు దేశాల ప్రభావంపడింది. కొత్తగా స్వాతంత్ర్యం పొందిన మన దేశం విదేశీ వ్యవహారాలలో తటస్థ విధానాన్ని అనుసరించింది. దేశాభివృద్ధికి మిశ్రమ ఆర్థిక విధానాన్ని అనుసరించింది. ప్రభుత్వరంగం ఆర్థికరంగంలో అత్యంత ప్రాముఖ్యమైంది. భారత కార్మికవర్గం చేసిన పోరాటం కీలకమైంది. 1930 నుంచి 1980 వరకు కార్మికవర్గం ఉత్పత్తి రంగంలో తన పాత్రను బహువిధంగా పెంచింది. అయితే, 1990 నుంచి 2023 వరకు ఉత్పత్తి తగ్గిపోయింది. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి ఫలాలు సంపన్నుల నుంచి దిగువ తరగతిలో ప్రజలకు అందుతుందని నమ్ముతుంది. అయితే, ఈ సిద్ధాంతాన్ని వెనుకేసుకొస్తున్న వారు వాదిస్తారు. ప్రస్తుతం ప్రపంచీకరణ విధానంలో ప్రైవేటీకరణ, కార్మికవర్గ వ్యతిరేక విధానాలను, ఉదారవాదాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థ అనుసరిస్తున్నది. ఈ విధానాన్ని కార్మికవర్గం ప్రతిఘటిస్తున్నది. సమానత్వం, మానవహక్కులు, సెక్యులరిజం, సామాజిక న్యాయం, ప్రజలందరికీ అభివృద్ధి ఫలితాలు అందాలని పోరాటాలు సాగిస్తున్నారు.

వ్యవసాయానికి మేలుచేసే డ్రోన్లు

నవంబర్ 29న జరిగిన కేంద్ర క్యాబినెట్‌లో వ్యవసాయ రంగంలో వినియోగంకోసం మహిళా సంఘాలకు డ్రోన్‌లను అందజేస్తామని నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో డ్రోన్ల ఆవశ్యకత, ఉపయోగాల గురించి పరిశీలిద్దాం. మెజారిటీ గ్రామీణ కుటుంబాలకు వ్యవసాయమే ప్రధాన ఆదాయ వనరు. సుమారు 77శాతం రైతులు వ్యవసాయం, దాని అనుబంధ రంగాల ద్వారా ఉపాధి పొందుతున్నారు. భారతదేశ ఆర్థికవ్యవస్థ స్థూల జాతీయోత్పత్తిలో దాదాపు 17.5శాతం వ్యవసాయరంగం ద్వారా సమకూరుతుంది. ప్రస్తుతం ఈ రంగం ఉత్పాదకతలో క్షీణత, వాతావరణ అననుకూలత, వ్యవసాయకూలీలు సంఖ్య తగ్గడం, అధిక రసాయన మందులు వాడకం, నైపుణ్యంతో కూడిన మానవ వనరులలేమి వంటి సవాళ్లను ఎదుర్కుంటోంది. ఈ సవాళ్లను అధునాతన సాంకేతికతల సహాయంతో పరిష్కరించవచ్చు. భారతదేశంలో డ్రోన్ సాంకేతికతను వ్యవసాయంలో ఉపయోగించడం సామాజిక, ఆర్థికపరంగా స్థిరమైన వ్యవసాయానికి దోహదం చేస్తుంది. నేల విశ్లేషణ, వ్యవసాయ రసాయనాలు, పంట పర్యవేక్షణ, నీటిపారుదల నిర్వహణ, పంట ఆరోగ్యం అంచనా, పశువుల పర్యవేక్షణ, విపత్తు నిర్వహణ, జియో-ఫెన్సింగ్, పంట బయోమాస్ నష్టం అంచనా, మిడతల నియంత్రణ వంటి పనులలో డ్రోన్లు ఉపయోగపడతాయి. రైతుల సమయం, శ్రమ, నీరు ఖర్చులను తగ్గిస్తుంది. వివిధ రసాయన ప్రభావాల నుండి రైతులను రక్షిస్తుంది. మెరుగైన సామర్థ్యం కలిగిన డ్రోన్‌లు పెద్ద పంటపొలాలను త్వరగా, సమర్థంగా కవర్ చేస్తాయి. తద్వారా రైతులు డేటాను సేకరించడానికి, పంటలను మరింత సమర్థవంతంగా పర్యవేక్షించడానికి వీలు కల్పిస్తుంది. సమస్యలను ముందుగానే గుర్తించడంలో సహాయపడుతుంది.

ఏదైనా వృక్ష సంపద లేదా పంట, కలుపుమొక్కలు, అంటువ్యాధులు, తెగుళ్ల వల్ల కలిగే పొలాల ప్రాంతాలలో వాస్తవ పరిస్థితిని అంచనా వేయడానికి డ్రోన్‌లను ఉపయోగించవచ్చు. ఈ అంచనా ఆధారంగా ఈ ముట్టడిని ఎదుర్కోవడానికి అవసరమైన రసాయనాలను ఎంత పరిమాణంలో ఉపయోగించాలో తెలుసుకోవడానికి ఈ సమాచారం ఉపయోగపడుతుంది. దీనికి అయ్యే ఖర్చును తగ్గించుకోవచ్చు. డ్రోన్‌లు నేల నాణ్యత, తేమ, పోషకస్థాయిలపై డేటాను అందించగలవు. క్రాప్ సర్వేయింగ్, మ్యాపింగ్, స్ప్రేయింగ్ వంటి ప్రస్తుతం చేతితోచేసే అనేక పనులను డ్రోన్‌లు ఆటోమేట్ చేయగలవు. దీనివల్ల రైతులకు కూలీలఖర్చు ఆదా అవుతుంది. మరింత సమర్థవంతమైన పంటలపై చల్లడం సాంప్రదాయ పద్ధతులకంటే డ్రోన్‌లను ఉపయోగించి పురుగుమందులు, ఎరువులను సమర్థవంతంగా పిచికారీ చేయవచ్చు. ఇది రైతుల సమయాన్ని, డబ్బును ఆదాచేస్తుంది. పంట ఉత్పత్తి పర్యావరణ ప్రభావాన్ని కూడా తగ్గిస్తుంది. ఏటవాలులు లేదా అధిక-వోల్టేజ్

విద్యుత్ లైన్లు వంటి మానవులకు కష్టమైన, ప్రమాదకరమైన ప్రాంతాలను చేరుకోడానికి డ్రోన్‌లను ఉపయోగించవచ్చు. ఇది ప్రమాదాలు, గాయాల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. నానో-యూరియా, నానో-డిఎపిలను పిచికారీ చేయడానికి కూడా డ్రోన్‌లను ఉపయోగించవచ్చు. ఈ ఎరువులు పంట ఉత్పాదకతను 8శాతం నుండి 25శాతం పెంచుతాయి. పర్యావరణ ప్రభావాన్ని 50-70శాతం తగ్గిస్తాయి.

చేతులతో పనిచేసే కార్మికుల అవసరాన్ని తగ్గించడం, పురుగుమందులు, ఇతర రసాయనాల వినియోగాన్ని తగ్గిస్తాయి. పురుగుమందులు, ఎరువులు, ఇతర రసాయనాలను పంటలపై ఖచ్చితమైన, సమర్థవంతమైన పద్ధతిలో పిచికారీ చేయడానికి డ్రోన్‌లను ఉపయోగించవచ్చు. ఇది వనరుల వృథాను తగ్గించడానికి, రైతులు, పర్యావరణాన్ని హానికరమైన రసాయనాల నుంచి కాపాడడానికి సహాయపడుతుంది. పంటలను పొలాల నుంచి మార్కెట్‌లకు వేగంగా, అనుకూలమైనరీతిలో రవాణా చేయడానికి కూడా డ్రోన్‌లను ఉపయోగించవచ్చు. దీనివల్ల పంటకోత అనంతర నష్టాలను తగ్గించి, రైతుల లాభాలను పెంచవచ్చు. విత్తనాలు, మొక్కలు, ఇతర ఇన్‌పుట్‌లను పొలాలకు రవాణా చేయడానికి, రహదారి మౌలిక సదుపాయాలపై ఆధారపడటాన్ని తగ్గించడానికి కూడా డ్రోన్‌లను ఉపయోగించవచ్చు. డ్రోన్లు అధిక-రిజల్యూషన్ చిత్రాలు, డేటాను క్యాప్చర్ చేయగలవు. రైతులకు వారి పంటల గురించి వివరణాత్మకను అందిస్తాయి. డ్రోన్‌లు వ్యవసాయ సరిహద్దులను మ్యాప్ చేయడానికి, భూమి రికార్డులను డిజిటలైజ్ చేయడానికి కూడా ఉపయోగించవచ్చు. ఇది భూ వివాదాలను పరిష్కరించడానికి, భూమి హక్కుల భద్రతను నిర్ధారించడానికి సహాయపడుతుంది.

డ్రోన్‌లు పంటల నాణ్యత, పరిమాణాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఉత్పత్తి ఖర్చులను తగ్గించగలవు. కూలీలు లభ్యతలేక అధిక వ్యయం, పొలంలో రసాయనాలు వేసేటప్పుడు వాటిని తాకడంవల్ల ఆరోగ్య సమస్యలు, పురుగులు, జంతువులు కాటు వంటి అనేక సమస్యలను రైతులు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంలో, డ్రోన్లు హరిత సాంకేతికతవల్ల కలిగే ప్రయోజనాలతో కలిపి ఈ ఇబ్బందులను నివారించడంలో రైతులకు సహాయపడతాయి. పంట ఆరోగ్యం, పెరుగుదల, దిగుబడిపై సమాచారాన్ని అందించగలవు. ఇది రైతులు సమస్యలను ముందుగానే గుర్తించి, తదనుగుణంగా చర్యలు చేపట్టేందుకు సహాయపడుతుంది. ఫిక్కీ నివేదిక ప్రకారం డ్రోన్ పరిశ్రమ 2030 నాటికి భారతదేశ ఉత్పాదక సామర్థ్యాన్ని సుమారు 50 బిలియన్ల డాలర్లకు మెరుగుపరుస్తుంది. 500,000 ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను సృష్టించగలదు. డ్రోన్‌లు పంటలను పొలాలనుండి మార్కెట్‌లకు వేగంగా, సౌకర్యవంతంగా రవాణా చేయడానికి, రైతులకు అనేక ప్రయోజనాలను అందజేస్తుండగా, ఈ సాంకేతికతను అవలంబించకుండా నిరోధించే కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. డ్రోన్‌ల వాడకంవల్ల మానవశ్రమ అవసరాన్ని తగ్గిస్తుందని, తమ జీవనోపాధిపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇది డ్రోన్‌లను స్వీకరించడానికి రైతులలో ప్రతిఘటనను, విముఖతను సృష్టించవచ్చు. డ్రోన్ సాంకేతికత సామర్థ్యాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుంటే భారతదేశంలోని లక్షలాదిమంది రైతుల వ్యవసాయరంగాన్ని, జీవితాన్ని ఇవి మారుస్తాయి. వ్యవసాయకూలీల అవసరాన్ని తగ్గిస్తే గ్రామీణప్రాంతంలో ప్రత్యామ్నాయం లభించడం చాలాకష్టం.

డి.జె. మోహనరావు, 8247045230

మందరపు గానం... ఇంద్రగంటి పురస్కారం

గిన్నె రొట్టెని కొబ్బరి పచ్చడి, తేనె పానకంలో నలుచుకుని తిన్నారా ఎప్పుడైనా... పోనీ కొత్తావకాయ అన్నంలో పెరుగు కలుపుకుని ఓ ముద్ద రుచి చూశారా... ఇవి తినని వారు ఇంద్రగంటి శ్రీకాంత శర్మ కవిత్వం చదవండి. ఆయన రాసిన వచనం ఓ మాటు తిరగేయండి. పై రుచులు తెలుగు వారి స్వంతమైనట్లుగా ఇంద్రగంటి శ్రీకాంత శర్మ గారి కవిత్వం కూడా తెలుగు సాహితీ ప్రియుల ఆస్తి.

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

ఆయన పిల్లలకి ఇళ్లు, చదువులు, ఇతరేతర ఆస్తులు ఇచ్చి ఉంటారేమో తెలీదు కాని, తెలుగు సాహితీ ప్రియులకి మాత్రం ఆయన ఇచ్చిన ఆస్తి మంచి కవిత్వం, అంత కంటే మరింత చక్కని వచనం. ఓ పత్రికలో సాహిత్య పేజీ బాధ్యతలు చూస్తున్నప్పుడు ఇంద్రగంటి వారి ఇంచుమించు ఆత్మకథలాంటి కాలమ్ వచ్చింది. ఆ సమయంలో ఆయన ఒకింత అనారోగ్యంతో మంచం మీద ఉన్నారు. నేనే ప్రతి గురువారం వారింటికి వెళ్లి ఆయన చెబుతూంటే రాసుకునే వాడ్ని. కొన్నిసార్లు ఆయన ముందే రాసేస్తే అ వ్యాసం తెచ్చుకునే వాడ్ని. అదిగో ఆ సమయంలోనే మా మధ్య దొర్లిన కబుర్లలో పైన చెప్పిన రుచులు కూడా వచ్చాయి. ఓ రోజు గిన్నె రొట్టే, కొబ్బరి పచ్చడి తీసుకువెళ్లాను. ఎంతో ఇష్టంగా తింటున్న ఇంద్రగంటి శ్రీకాంత శర్మగారు "అవును చక్రధర్ గారు. మన రుచుల గురించి మీ తరం ఎవ్వరూ ఎక్కడా రాయరేం. సాహిత్యంలో అదీ భాగమే కదా" అన్నారు. నాకు ఏమనలో తెలియక ఓ వెకిలి నవ్వు నవ్వేశాను. ఆయన పేరిట ప్రతి ఏటా ఇస్తున్న కవిత్వ పురస్కారం సందర్భంగా ఆయన రుచులు, అభిరుచులతోనే ఇలా రాయాలని అనిపించింది.

తెలుగు సాహిత్యంలో ఓ కవితతోనో, ఓ కథతోనో చాలా ఎక్కువ పేరు తెచ్చుకున్న వారు ఉన్నారు. ఆ సృజన తర్వాత వారెన్ని మంచి కథలు రాసినా, కవిత్వం రాసినా ఆ సృజనకారులను మాత్రం తమని కుదిపిన ఆ పద్యంతోనే చూస్తాం. దాని ప్రభావం అంతలా పడుతుంది. అలా ఓ కవితతో తెలుగు సాహిత్య సమాజాన్నే కాదు... కవిత్వంతో పరిచయంలేని, ఆ కవితలాంటి సహానుభూతి పొందిన ఎంతోమందిని అభిమానులుగా మార్చుకున్న కవయిత్రి మందరపు హైమవతి. గుర్తొచ్చిందిగా ఆ కవిత. అదే సర్ప పరిష్వంగం కవిత.

"ఇరువురి తనువులొకటైనాక
ఈ లోకాన్నే మరచిపోయిన
అమృత ఘడియలలో
అక్షర తూణీరం నుంచి
ఒక ప్రశ్నల బాణం సంధిస్తావు
" జీతమెప్పుడిస్తారు"

ఈ కవిత చదివిన స్త్రీలు కొందరు తమ అనుభవంగా తలిస్తే, పురుషులు ఆ సమయంలోనే కాదు... ఏ సమయంలోనూ ఆర్థిక ప్రస్తావన తీసుకు రాకూడదన్న ఎరుకలోకి వచ్చారు. ఇంత అద్భుతమైన పద్యం రాసిన మందరపు హైమవతి గారు ఆ తర్వాత చాలా మంచి పద్యాలు రాసినా ఆ పేరు వినగానే ఈ పద్యమే గుర్తుకువస్తుంది. ఇదిగో, ఈసారి ఇంద్రగంటి శ్రీకాంత శర్మగారి పేరిట ఇస్తున్న కవిత్వ పురస్కారాన్ని ఈ కవయిత్రికి ఇస్తున్నారు.

సహానుభూతి కంటే స్వీయానుభూతి నుంచే మంచి కవిత్వమైనా, కథైనా వస్తుందని నా విశ్వాసం. నమ్మకం. నీ స్వీయానుభూతి మరొకరిది కూడా అయినప్పుడు ఆ సృజనకారుల కవిత్వం చిరకాలం గుర్తుండిపోతుంది.

"ఊళ్లేలతావా... ఉద్యోగం వెలగబెడతావా చదువుకుందుకు" అని తల్లితండ్రులు ఒకప్పుడు అమ్మాయిల మీద ఆంక్షలు విధించే వారు. ఈ కారణంగా తెలుగుసమాజంలోనే కాదు...దేశవ్యాప్తంగా ఎంతో మంది మహిళలు విద్యకు దూరమైనసందర్భాలు అనేకానేకం ఉన్నాయి. అయితే, చదువుకుని ఉద్యోగాలు చేసిన మహిళలు కూడా పెళ్లైన తర్వాత తమ చేతికి అందీఅందనట్లుగా ఎగిరిపోయే జీతం రాళ్ల చూసినవారే. వారంతా కవిత్వం రాయకపోవచ్చు. కాని, మందరపు హైమవతి రాసిన నెలకోసారి పద్యం చదివే ఉంటారు. కార్పొరేట్ మహిమ వల్ల అంతకు ముందు చేతికిచ్చే జీతాలు కాస్తా బ్యాంకు ఖాతాల్లోనే పడడం కూడా మహిళలకు మిగిల్చిన విషాదమే. దీనిమీద కూడా ఆగ్రహించారు మందరపు హైమవతి నెలకోసారి కవితలో...

"ఒకప్పుడు/జీతాలు చేతికిచ్చే రోజుల్లో
ఒక్కరోజైనా /నా ముంజేతి మీద
ముద్దల చిలకలా వాలేది వేతనబాల"

ఇలా వాలిన చిలుకను తనివితీరా చూసుకోకముందే, తడమక ముందే భర్త ఎగురేసుకుపోవడం కూడా స్వీయ, సాహానుభూతులే. ఇంద్రగంటి శ్రీకాంత శర్మ గారు భావ కవిత్వమే రాసినా బాధమయ జీవితాలను, ఆ గాథలను కూడా చాలా దగ్గరగా చూశారు. బహుశా ఆయన పేరిట ఇస్తున్న ఈ పురస్కారానికి మందరపు హైమవతిగారికి ఉన్న అర్హత కూడా ఇదేనేమో. బెర్టోల్డ్ బ్రెష్ట్ అన్నట్లు...

"చీకటి రోజుల్లో గానాలుండవా.../ ఉండకేం.../చీకటి రోజుల గురించి గానాలుంటాయి". అవును.. మందరపు హైమవతి గారి కవిత్వమంతా చీకటి రోజుల గానాలే గురించే.

ఒకరి పేరిట పురస్కారం ఇవ్వడమంటే వారి వారసత్వాన్ని మరొకరి చేతిలో పెట్టడమే. అలా ఇంద్రగంటి వారి కవిత్వ వారసురాలిని ఆ కుటుంబ సభ్యులు మందరపు హైమవతి గారిలో చూశారేమో. మరి ప్రతీ ఏటాఇస్తున్నారు కదా... వీరంతా వారసులేనా అనొచ్చు. ఇంద్రగంటి శ్రీకాంత శర్మగారిది జగమంత సాహిత్య కుటుంబం. ఇందులో ఆయన వారసత్వాన్ని నిలుబెట్టుకునే వారెవరో భవిష్యత్ నిర్ణయిస్తుంది.

లిబియావీరుడు ఉమర్‌ముఖ్తార్‌పై వచ్చిన సినిమా ముగింపులో ముఖ్తార్‌ని ఉరితీసాక ఆ బహిరంగ ప్రదేశంలో ఉన్న వారంతా ఎవరికి వారు కన్నీళ్లతో వెళ్లిపోతారు. ఓ ఐదారేళ్లే కుర్రాడు నేలపై పడిన ముఖ్తార్ కళ్లజోడుని తీసుకుని పెట్టుకుంటాడు. సినిమా ముగుస్తుంది. ఉద్యమం మళ్లీ మెలకెత్తుతుంది. ఇదే వారసత్వం అంటే.

(హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం ప్రముఖ కవి, సంపాదకులు ఇంద్రగంటి శ్రీకాంత శర్మ పురస్కారాన్ని కవయిత్రి మందరపు హైమవతికి ఇస్తున్న సందర్భంగా ...)

సీనియర్ జర్నలిస్టు, 99120 19929

కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు...నలుగురి మృతి

బెంగళూరు: కర్నాటకలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో కారులో ఉన్న వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో శిరసి నుంచి కుంట వెళు న్న ఆర్టీసీ బస్సు...కుంట నుంచి శిరసికి వస్తున్న మారుతీ స్విఫ్ట్ కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. కాగా బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటన జరిగిన సమయంలో కారులో మొత్తం ఐదుగురు ఉన్నారు. వారిలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తి గాయపడ్డారు. కాగా ఆ సమయంలో బస్సులో డ్రైవర్ తో పాటుగా 60మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే ఈ ఘటనలో డ్రైవర్ కి గాని, బస్సులోని ప్రయాణికులకు గాని ఎలాంటి గాయాలు కాలేదు. కాగా ఘటన గురించి సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటీన ఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్నవారు తమిళనాడుకి చెందినవారిగా గుర్తించామని పేర్కొన్నారు.

విచారణకు ముందు నిందితులను ఎక్కువ కాలం జైల్లో ఉంచరాదు: సుప్రీం



న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో నిందితుడిగా గత 13 నెలలుగా జైలులోనే ఉన్న పెర్నాడ్ రికార్డ్ ఇండియా ప్రతినిధి బినోయ్ బాబుకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా దర్యాప్తు సంస్థల వ్యవహార శైలిపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణకు ముందు నిందితులను ఎక్కువ రోజులు జైలులో ఉంచడం సరైన చర్య కాదని స్పష్టం చేసింది. నిందితులపై ఈడీ, సీబీఐ చేసిన ఆరోపణల మధ్య వ్యత్యాసం ఉందని, ఈ విచారణ ఎలా సాగుతోందో తెలియడం లేదని జస్టిస్ సంజీవ్ ఖన్నా తెలిపారు. బినోయ్ బాబు తరపు న్యాయవాది హరీష్ సాల్వే మాట్లాడుతూ... 13 నెలలుగా ఆయన జైలులోనే ఉన్నారని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. అలాగే సుప్రీంకోర్టుకు సమర్పించిన పిటిషన్‌లో లేవనెత్తిన అంశాల ఆధారంగా ధర్మాసనం బినోయ్‌బాబుకు బెయిల్ మంజూరు చేసింది. దిల్లీ మద్యం కేసులో అనేకమంది ప్రముఖులు అరెస్టయిన విషయం తెలిసిందే. వారిలో దిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా సహా ఇద్దరు సీనియర్ ఆప్ సభ్యులు కూడా ఉన్నారు. సిసోడియా ఫిబ్రవరి నుంచి, రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ అక్టోబర్ నుంచి జైలులో ఉన్నారు. అక్టోబర్ 30న సిసోడియా బెయిల్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. హోల్‌సేల్ మద్యం డీలర్‌లకు రూ.338 కోట్ల 'విండ్‌ఫాల్ గెయిన్'లను సులభతరం చేయడంలో ఆయనపై వచ్చిన అభియోగాలు 'తాత్కాలికంగా' సాక్ష్యాధారాలతో సమర్థించబడుతున్నాయని న్యాయస్థానం పేర్కొంది. సిసోడియా గత వారం కోర్టును ఆశ్రయించి తన ఉత్తర్వులను సమీక్షించాలని కోరారు.

డాక్టర్ ఆత్మహత్యపై ఐదు రోజుల్లో నివేదిక: ఎన్‌సీడబ్ల్యూ

న్యూఢిల్లీ: కేరళలోని తిరువనంతపురంలో కట్నం డిమాండ్‌తో ఓ యువ డాక్టర్ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యూ) తీవ్ర ఆందోళన వెలిబుచ్చింది. ఈ ఘటనపై తీసుకున్న చర్యల నివేదికను ఐదు రోజుల్లో సమర్పించాలని కేరళ పోలీసులను ఆదేశించింది. ఆరోపణలు నిజమని తేలితే నిందితుడిపై వరకట్న నిషేధ చట్టం, ఐపీసీలోని సంబంధిత సెక్షన్లు నమోదు చేయాలని సూచించింది. కట్నం డిమాండ్‌తో యువ డాక్టర్ ఆత్మహత్య చేసుకోవడం బాధించిందని, నిందితుడిని, అతని తరపు బంధువులను అరెస్టు చేయాలని స్పష్టంచేసింది. మహిళల హక్కుల రక్షణ సమాజం బాధ్యతని, ఐదు రోజుల్లో నివేదిక తమకు అందజేయాలని కమిషన్ ఎక్స్‌లో పోస్టు చేసింది. డాక్టరు ఆత్మహత్య కేసులో నిందితుడిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. వరుడి తరపు నుంచి భూమి, బీఎండబ్ల్యూ కారు, బంగారం సహా పెద్దమొత్తంలో కట్నం డిమాండ్ చేసినట్లు డాక్టర్ తరపు బంధువులు ఆరోపించారు.

టికెట్ లేకుండా రైలులో కూడా ప్రయాణించవచ్చు..!

అమల్లోకి కొత్త నిబంధన

న్యూఢిల్లీ: భారతీయ రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం ఎప్పటికప్పుడు కొత్త నిబంధనలను అమలు చేస్తుంది. అంతేకాదు రైళ్లలో ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. దేశంలో ప్రతిరోజూ దాదాపు 2.5 కోట్ల మంది రైలులో ప్రయాణిస్తున్నారు. రైలులో ప్రయాణించాలంటే టికెట్ కొనడం తప్పనిసరి. అందుకోసం రైలు బయలు దేరే చివరి క్షణం వరకు కూడా ప్రయాణికులు టికెట్ కౌంటర్ వద్ద క్యూలైన్లలో నిలబడి ఉండటం కనిపిస్తుంది. ఈ క్రమంలోనే కొందరు టిక్కెట్లు కొనుగోలు చేయలేకపోతున్నారు. ఇలాంటి సందర్భాల్లో టిక్కెట్లు లేకుండానే రైలు ఎక్కేస్తుంటారు. ఇలా టికెట్ లేకుండా రైలు ఎక్కిన తర్వాత పట్టుబడితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. యితే, ఇకపై ఇండియన్ రైల్వేలో .. రైలు ఎక్కేటప్పుడు చేతిలో టికెట్ లేకపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. క్రైమ్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో తన ట్విట్టర్ హ్యాండిల్‌లో భారతీయ రైల్వేకు సంబంధించిన కొన్ని ప్రత్యేక నిబంధనలను షేర్ చేసింది . దీని ప్రకారం రైలు ఎక్కే సమయంలో ప్రయాణికులు టిక్కెట్లు కొనుగోలు చేయకున్నా ఇబ్బంది ఉండదు. కొత్త నిబంధనల ప్రకారం రైలు లోపల టిక్కెట్లు జారీ చేసే సౌకర్యాన్ని కూడా రైల్వే ప్రారంభించింది. ఈ సదుపాయం కింద టికెట్ లేని ప్రయాణికులు టిక్కెట్లు తీసుకోవడానికి టీటీఈని సంప్రదించవచ్చు. చేతిలో టికెట్ లేకపోతే మీరు రైలు ఎక్కిన వెంటనే టీటీఈని సంప్రదించి మీ పరిస్థితిని వారికి తెలియజేయాలి. అప్పుడు మాత్రమే భారతీయ రైల్వే నిబంధనల ప్రకారం మీ టికెట్ టీటీఈ నుండి పొందవచ్చు. ఈ సదుపాయం కింద, టీటీఈ వద్ద ఒక హ్యాండ్ హెల్డ్ మెషిన్ ఉంటుంది. దీని సహాయంతో టీటీఈ రైలు లోపల ఉన్న ప్రయాణీకులకు టిక్కెట్ లేకపోతే జారీ చేస్తాడు.

టీటీఈ వద్ద ఉన్న యంత్రం రైల్వే ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ సర్వర్‌కు కనెక్ట్ చేయబడి ఉంటుంది. ప్రయాణికుడు టిక్కెట్‌ను పొందడానికి మెషిన్‌లో పేరు, వారు దిగాల్సిన స్టేషన్ నమోదు చేసిన వెంటనే టిక్కెట్‌ను జారీ చేస్తారు. రైలులో అందుబాటులో ఉన్న బెర్త్‌ల గురించిన సమాచారాన్ని ఈ యంత్రం ద్వారా సులభంగా పొందవచ్చు. అయితే, మీరు ముందుగా టిక్కెట్లు కొనకపోతే 250 రూపాయల జరిమానా, మీరు రైలు ఎక్కిన ప్రదేశం నుండి గమ్యస్థానానికి చార్జీలు చెల్లించాలని గుర్తుంచుకోండి. ఏదైనా ప్రయాణీకుల వెయిటింగ్ లిస్ట్ క్లియర్ కాకపోతే, మీరు టీటీఈ వద్దకు వెళ్లి టిక్కెట్‌ను చూపించి ఖాళీగా ఉన్న సీటు గురించి సమాచారాన్ని తెలుసుకుని దానిని ఖరారు చేయించుకోవచ్చు. సీటు ఖాళీగా ఉంటే లేదా ఏ సీటులోనైనా ప్రయాణికులు రాకపోతే టీటీఈ మీకు ఆ బెర్త్ ఇస్తారు. ఇండియన్ రైల్వే అధికారిక టికెటింగ్ యాప్, మీ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్ ద్వారా ప్లాట్‌ఫారమ్ టిక్కెట్లు, టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చు.

వరద ముంపులోనే చెన్నై

చెన్నై: మిచౌంగ్ తుపాను తాకిడికి అతలాకుతలమైన తమిళనాడు రాజధాని చెన్నైని నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. కుండపోత వానతో చెన్నైలోని అనేక ప్రాంతాలు పూర్తిగా నీటమునిగిన సంగతి విదితమే. భారీ వర్షాల ధాటికి జనజీవనం అస్తవ్యస్తమైంది. అయితే వర్షాలు తగ్గి రెండు రోజులు అయినప్పటికీ నగరం ఇంకా వరద ముంపులోనే ఉంది. చాలా ప్రాంతాల్లో వరద నీరు ఇంకా తొలగిపోలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసర వస్తువుల కొరత, కరెంటు, ఆహారం, నీరు లేక అల్లాడుతున్నారు. కేవలం సామాన్య ప్రజలే కాదు కొంతమంది స్టార్ సెలబ్రిటీలు కూడా ఈ వరదల్లో చిక్కుకున్నారు. ప్రముఖ నటుడు రజినీకాంత్ ఇంటిని కూడా వరద నీరు చుట్టుముట్టింది.. చెన్నైలోని పోయెస్ గార్డెన్ ప్రాంతంలో ఉన్న రజినీ ఇంటి బయట భారీగా వరద నీరు నిలిచిపోయింది. నీటి ఎద్దడి కారణంగా ఆ ప్రాంతంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రజినీకాంత్ ఇంటి వద్ద వరదనీటికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. మరోవైపు వరద బాధితులకు రజినీకాంత్ రూ.10 కోట్లు విరాళంగా ప్రకటించారు. ఈ విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందించారు. నటులు సూర్య, ఆయన సోదరుడు కార్తీ కూడా రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. పలువురు సినీ తారలు వరద బాధితులకు ఆహారం, నీరు, నిత్యావసరాలు వంటి సాయం అందజేస్తున్నారు.

వడ్డీ రేట్లు యథాతథం



ముంబై: భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) వరుసగా ఐదోసారి వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించింది. ఈసారి కూడా కీలక వడ్డీ రేట్లను 6.5 శాతంగానే ఉంచింది. మూడు రోజుల పాటు సాగిన ఆర్బీఐ ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను గవర్నర్ శక్తికాంత దాస్ మీడియాకు వెల్లడించారు. వీటిలో కీలకాంశాలు ఈ విధంగా ఉన్నాయి.

- 2024 ఆర్థిక సంవత్సరానికి భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి (జీడీపీ) అంచనాను ఆర్బీఐ 7 శాతానికి పెంచింది. మూడు, నాలుగో త్రైమాసికాల్లో వృద్ధి రేటు 6.5 శాతం, 6 శాతం ఉండవచ్చని పేర్కొంది. 2025 ఆర్థిక సంవత్సరం మొదటి మూడు త్రైమాసికాల్లో జీడీపీ వృద్ధి రేట్లు వరుసగా 6.7 శాతం, 6.5 శాతం, 6.4 శాతంగా ఆర్బీఐ అంచనా వేసింది.
- డిసెంబర్ 1తో ముగిసిన వారానికి భారతదేశ విదేశీ మారక నిల్వలు 604 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు ఆర్బీఐ గవర్నర్ ప్రకటించారు. ఇది అంతకుముందు వారం నిల్వలతో పోలిస్తే 2.54 బిలియన్ డాలర్లు పెరిగింది. నవంబర్ 24 నాటికి 597.94 బిలియన్ డాలర్లుగా ఉంది.
- ఆస్పత్రులు, విద్యా సంస్థలకు యూపీఐ పరిమితిని రూ. లక్ష నుంచి రూ. 5 లక్షలకు పెంచుతున్నట్లు ఆర్బీఐ ప్రకటించింది.
- ఆహార ధరల పెరుగుదల, ముడి చమురు వ్యయాల హెచ్చుతగ్గులు, దేశీయ ఆర్థిక వృద్ధి ద్రవ్యోల్బణ ఒత్తిడిని కలిగించే సంభావ్యత గురించి భయాందోళనలు ఉన్నప్పటికీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణ అంచనాను 5.4 శాతంగా ఆర్బీఐ కొనసాగించింది.
- 2023-24 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం 5.4 శాతంగా ఉండొచ్చని ఆర్బీఐ అంచనా వేసింది. మూడో త్రైమాసికంలో 5.6 శాతంగా, నాలుగో త్రైమాసికంలో 5.2 శాతంగా ఉండవచ్చని అంచనా వేస్తోంది. లక్షిత ద్రవ్యోల్బణం 4 శాతాన్ని ఇంకా అందుకోవాల్సి ఉందని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. ద్రవ్యోల్బణం ఇంకా అనిశ్చితితోనే ఉందన్నారు.
- డిజిటల్ లోన్స్ లో మరింత పారదర్శకత ఉండేలా వెబ్ అగ్రిగేటర్ల కోసం నూతన మార్గదర్శకాలు తీసుకురానున్నట్లు ఆర్బీఐ గవర్నర్ తెలిపారు.
- రికరింగ్ చెల్లింపుల ఈ- మ్యాండేట్ లిమిట్ ను రూ. 15000 నుంచి రూ. 1,00,000 కు పెంచనున్నట్లు ఆర్బీఐ ప్రకటించింది.
- ఇతర దేశాల కరెన్సీతో పాటు డాలర్ తో రూపాయి మారకం విలువ తక్కువ ఒడుడొడుకులనే ఎదుర్కొంటున్న ఆర్బీఐ తెలిపింది.



నాలుగు రాష్ట్రాల్లో భూ ప్రకంపనలు

న్యూఢిల్లీ: భారత్ నలుమూలలా నేడు భూమి కంపించింది. ఆగ్నేయంలో తమిళనాడు, నైరుతిలో కర్నాటక, వాయువ్యంలో గుజరాత్, ఈశాన్యాన మేఘాలయ రాష్ట్రంలో శుక్రవారం భూప్రకంపనలు వచ్చాయి. మొదట కర్నాటకలో ఉదయం 6.52 గంటలకు భూమి కంపించింది. రాష్ట్రంలోని విజయపురలో ప్రకంపనలు రావడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. రిక్టర్ స్కేలుపై 3.1 తీవ్రత నమోదైంది. ఆ తర్వాత మరో 45 నిమిషాల వ్యవధిలో తమిళనాడులోని చెంగల్పట్టులో భూకంపం చోటుచేసుకుంది. చెంగల్‌పట్టు జిల్లా వాసులు రోడ్డుపైకి పరుగులు తీశారు. భూమి తిరిగినట్లు, ఇంట్లో వస్తువులు కదిలినట్లు అనిపించడంతో చాలా మంది అయోమయానికి గురయ్యారు. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 3.2గా నమోదైంది. 10 కి.మీ. లోతులో భూకంప కేంద్రాన్ని సంబంధిత అధికారులు గుర్తించారు. అనంతరం మేఘాలయ రాజధాని షిల్లాంగ్ లో ఉదయం 8.46 గంటలకు భూకంపం రాగా, ఉదయం 9 గంటలకు గుజరాత్ లోని కచ్ ప్రాంతంలో ప్రకంపనలు సంభవించాయి. షిల్లాంగ్ లో 3.8 తీవ్రత నమోదైంది. ఈ మేరకు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ వెల్లడించింది.

ఉత్తరాఖండ్‌లో అవకాశాలను అన్వేషించండి

పెట్టుబడిదారులను కోరిన ప్రధాని మోదీ



డెహ్రాడూన్ : పెట్టుబడిదారులు ఉత్తరాఖండ్‌లో వివిధ రంగాల్లో ఉన్న అపరిమితమైన సామర్థ్యాన్ని అన్వేషించాలని, వాటిని అవకాశాలుగా మార్చుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం కోరారు. ఇక్కడి అటవీ పరిశోధన సంస్థలో ఉత్తరాఖండ్ ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సును ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. 'ప్రకృతి, సంస్కృతి, వారసత్వం... ఉత్తరాఖండ్‌లో అన్నీ ఉన్నాయి. మీరు వాటిని అన్వేషించి, వాటిని అవకాశాలుగా మార్చుకోవాలి' అని మోదీ అన్నారు. శతాబ్దపు మూడో దశాబ్దం ఉత్తరాఖండ్‌కు చెందుతుందని గతంలో కేదార్‌నాథ్ పర్యటన సందర్భంగా తాను చేసిన వ్యాఖ్యలను గుర్తు చేసుకుంటూ, ఆ అంచనా నిజమవుతోందని తెలిపారు. పదేళ్లుగా ఆకాంక్ష భారత్ ఆవిర్భవించిందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసే స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు మోదీ హౌస్ ఆఫ్ హిమాలయాస్ బ్రాండ్‌ను కూడా ప్రారంభించారు. 'ఇది విదేశాల్లోని మార్కెట్లలో స్థానిక ఉత్పత్తులకు గుర్తింపును ఇస్తుంది. రాబోయే కాలంలో 2 కోట్ల లఖపతి దీదీలను (సోదరీమణులు) తయారు చేయాలన్న నా నిబద్ధతను నెరవేర్చడానికి కూడా ఇది సహాయపడుతుంది' అని ప్రధాన మంత్రి అన్నారు. నెలరోజులుగా శిఖరాగ్ర సమావేశానికి సన్నాహాలు జరుగుతున్నాయి. దీనికి దేశ, విదేశాల నుంచి వెయ్యి మందికి పైగా పెట్టుబడిదారులు, ప్రతినిధులు హాజరవుతున్నారు. సదస్సు లక్ష్యం రూ.2.5 లక్షల కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలపై సంతకం చేయడం.

బీజేపీ సీఎంల రేసు

మూడు రాష్ట్రాలకు పరిశీలకుల నియామకం

న్యూఢిల్లీ : రాజస్థాన్, మధ్య ప్రదేశ్, చత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించినప్పటికీ, ఆయా రాష్ట్రాలకు సీఎంల ఎంపికకు నానా తంటాలు పడుతోంది. దీంతో ఆ రాష్ట్రాలకు ప్రధాన పరిశీలకులుగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హరియానా ముఖ్యమంత్రి ఎం.ఎల్.ఖట్టర్, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ ముండాను బీజేపీ శుక్రవారం నియమించింది. రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే, సరోజ్ పాండే రాజస్థాన్‌లో ఎన్నికయిన ఎమ్మెల్యేలతో సీఎం ఎంపిక ప్రక్రియను పర్యవేక్షిస్తారు. హరియానా సీఎం ఖట్టర్, ఆశ లక్రా, బీజేపీ ఓబీసీ విభాగం అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మధ్య ప్రదేశ్‌కు వెళ్లనున్నారు. అర్జున్ ముండా, సర్బానంద్ సోనోవాల్, బీజేపీ ప్రధాన కార్యదర్శి దుష్యంత్ గౌతమ్ చత్తీస్‌గఢ్ పరిస్థితిని పర్యవేక్షిస్తారు. రాజస్థాన్‌లో మాజీ సీఎంలు వసుంధర రాజే, చత్తీస్‌గఢ్‌లో రమణ్‌సింగ్, ఎంపీలో శివరాజ్ చౌహాన్ కొత్త ముఖాలను భర్తీ చేస్తే తప్ప, లేదంటే పోటీలో ఉంటారని ఆ వర్గాలు తెలిపాయి. పార్టీ ఈ అనుభవజ్ఞులను సీఎంలుగా పునరావృతం చేయవచ్చు, చత్తీస్‌గఢ్‌లో గిరిజన ముఖాలు లతా ఉసెండి, గోమతి సాయి, రేణుకా సింగ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్ సావో, విష్ణు సాయి, రామ్ విచార్ నేతమ్‌తో పాటు సీఎం రేసులో ఉన్నారు. మధ్య ప్రదేశ్ ఎన్నికల్లో చౌహాన్‌తో పాటు నరేంద్ర తోమర్, ప్రహ్లాద్ పటేల్, కైలాశ్ విజయవర్గియా కూడా పోటీలో ఉన్నారు. రాజస్థాన్‌లో వసుంధరా రాజే కాకుండా దియా కుమారి, మహంత్ బాలక్ నాథ్ పోటీలో ఉన్నారు. ఈ వారాంతంలో పరిశీలకులు రాష్ట్రాలను సందర్శించి ఎమ్మెల్యేలతో మాట్లాడనున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బీజేపీ పార్లమెంటరీ బోర్డుకు పరిస్థితిని నివేదిస్తారు. బహుశా ఆదివారం నాటికి తుది నిర్ణయం జరగవచ్చని భావిస్తున్నారు.

ఉల్లి ఎగుమతులపై నిషేధం

న్యూఢిల్లీ: దేశంలో ఉల్లి లభ్యతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ధరలను అదుపులో ఉంచడంతో పాటు, సామాన్యులకు ఉల్లిని అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటుంది. ఉల్లి ఎగుమతులపై వచ్చే ఏడాది మార్చి వరకు నిషేధాన్ని విధిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. 'ఉల్లిపాయల ఎగుమతి విధానం.. మార్చి 31, 2024 వరకు నిషేధించబడింది' అని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) వెలువరించిన నోటిఫికేషన్‌లో తెలిపింది. దేశ రాజధానిలో స్థానిక విక్రేతలు కిలో ఉల్లిని రూ.70-80 చొప్పున విక్రయిస్తున్నారు. దీనికి ముందు వినియోగదారులకు ఉపశమనం కలిగించేందుకు రిటైల్ మార్కెట్‌లలో ఉల్లి బఫర్ స్టాక్‌ని కిలోకు రూ. 25 చొప్పున విక్రయించాలని కేంద్రం అక్టోబర్ నెలలో నిర్ణయించింది. ధరల నియంత్రణకు కేంద్రం గతంలో అనేక చర్యలు తీసుకుంది. అక్టోబర్ 28 నుంచి ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు ఉల్లి ఎగుమతులపై టన్నుకు కనిష్ఠఎగుమతి ధర(ఎంఈపీ)ని 800 డాలర్లుగా విధించింది. ఆగస్టు నెలలో డిసెంబర్ 31 వరకు ఉల్లిపై 40 శాతం ఎగుమతి సుంకాన్ని విధించింది. అయితే, ఉల్లి ఎగుమతులపై పలు దేశాల అభ్యర్థన మేరకు మంజూరు చేసిన అనుమతి ఆధారంగా అనుమతించబడుతుందని డీజీఎఫ్‌టీ తెలిపింది. ఈ నోటిఫికేషన్ ముందు వరకు లోడైన ఉల్లిపాయల షిప్‌మెంట్‌ల ఎగుమతి చేసుకోవడానికి అనుమతించబడుతుందని పేర్కొంది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 4 వరకు దేశం నుంచి 9.75 లక్షల టన్నుల ఉల్లి ఎగుమతి చేసింది. దేశం నుంచి ఉల్లిని దిగుమతి చేసుకునే టాప్-3 దేశాల్లో బంగ్లాదేశ్, మలేషియా, యూఏఈ ఉన్నాయి. ఈ ఖరీఫ్ కాలంలో వర్షాలు, ఇతరత్రా వాతావరణ సమస్యలు ఉల్లి పంటపై ప్రభావం చూపడంతో, ధరలు పెరిగాయి. నవంబర్ 14న విడుదల చేసిన డబ్ల్యుపిఐ డేటా ప్రకారం, కూరగాయలు మరియు బంగాళదుంపల ద్రవ్యోల్బణం వరుసగా (-) 21.04 శాతం మరియు (-) 29.27 శాతం వద్ద ఉండగా.. అక్టోబర్ నెలలో మాత్రం ఉల్లి వార్షిక ధర పెరుగుదల రేటు 62.60 శాతం వద్ద అధికంగా ఉంది.

కాంగ్రెస్ నేత ఇంటిపై ఐటీ దాడులు..

అల్మరా నిండా నోట్ల కట్టలు

భువనేశ్వర్: ఒడిశాలోని కాంగ్రెస్ నేత ధీరజ్ సాహుకు నివాసాలు, కార్యాలయాలపై ఐటీ అధికారులు దాడి చేశారు. ఆయనకు సంబంధించి వివిధ ప్రాంతాల్లో రూ. 100 కోట్లకు పైగా నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆదాయపు పన్ను శాఖ వర్గాల సమాచారం ప్రకారం, ఒడిశాలోని బౌద్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు పట్టుబడిన డబ్బుల లెక్కింపులో బ్యాంకు సిబ్బందితో పాటు 30 మందికి పైగా అధికారులు పాల్గొన్నారు. నగదు లెక్కింపునకు ఎనిమిదికి పైగా మెషిన్లను ఉపయోగిస్తున్నారు. సుమారు 150 కరెన్సీ నోట్ల కట్టలు బొలంగీర్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క హెడ్ ఆఫీసుకు తరలించారు. ఈ మొత్తం నగదును ఒక అల్మరాలో భద్రపరిచారు. ఆ తర్వాత ఐటీ అధికారులు సుందర్‌గఢ్ నగరంలోని ఇల్లు, కార్యాలయం మరియు దేశీయ మద్యం డిస్టిలరీ, భువనేశ్వర్‌లోని బీడీపీఎల్ కార్పొరేట్ కార్యాలయం, కంపెనీ అధికారుల ఇళ్లతో సహా వివిధ ప్రదేశాలలో సోదాలు నిర్వహించారు. రాణిసతి రైస్ మిల్లుతో పాటు బౌధ్ రామ్‌చికటాలోని ఫ్యాక్టరీ, కార్యాలయంలో కూడా తనిఖీలు నిర్వహించారు. మరోవైపు ఈ వ్యవహారంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ జరిపించాలని బీజేపీ డిమాండ్ చేసింది. రాజ్యసభ సభ్యుడు దీపక్ ప్రకాష్ ఈ విషయంపై మాట్లాడుతూ మరికొంత మంది కాంగ్రెస్ ఎంపీలు కూడా ఇటువంటి కేసులలో తప్పనిసరిగా ప్రమేయం కలిగి ఉంటారని ఆరోపించారు.

ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టులో 11న తీర్పు

న్యూఢిల్లీ: జమ్ము కశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 రద్దును సవాల్ చేస్తూ దాఖలైన వివిధ పిటిషన్లపై ఈ నెల 11వ తేదీన సుప్రీంకోర్టు తుది తీర్పును వెలువరించనుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలో జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, సంజీవ్ ఖన్నా, బీఆర్ గవాయ్, సూర్య కాంత్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం తీర్పు వెలువరిస్తుంది. సెప్టెంబరులో ఈ పిటిషన్లపై విచారణ ముగియడంతో సుప్రీంకోర్టు తీర్పు రిజర్వ్ చేసిన విషయం తెలిసిందే. ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించిన పిటిషన్‌పై మొత్తం 16 రోజుల పాటు సుప్రీంకోర్టు వాదనలు ఆలకించింది. కేంద్ర ప్రభుత్వం తరపున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాదులు హరీశ్ సాల్వే, రాకేశ్ ద్వివేదీ, వి.గిరి వాదనలు వినిపించారు. జమ్ముకాశ్మీర్ కాన్స్టిట్యూయెంట్ అసెంబ్లీ రద్దు తర్వాత ఆర్టికల్ 370 శాశ్వతమైనదిగా మారిందని పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. రాజ్యాంగ సవరణలకు అవకాశం కల్పించే ఆర్టికల్ 368 ద్వారా ఆర్టికల్ 370ని రద్దు చేయలేమని స్పష్టం చేశారు. ఆర్టికల్ 370 తాత్కాలికమైన అధికరణ అని పేర్కొంది. జమ్ముకశ్మీర్‌ను దేశంలో పూర్తిగా ఐక్యం చేసేందుకు ఆర్టికల్ 370 రద్దు అనివార్యమైన ఆఖరి చర్య అని చెప్పుకొచ్చింది. ప్రత్యేకహోదా తొలగింపు తర్వాత కాశ్మీర్‌లో చోటుచేసుకున్న సానుకూల పరిణామాలు కూడా కోర్టు ముందుంచింది. ఇరు పక్షాలవాదనలు ఆలకించిన సుప్రీంకోర్టు తీర్పును రిజర్వు చేసింది. 2019 ఆగస్టు 5న బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత రాష్ట్రాన్ని జమ్మూకాశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. జమ్మూకాశ్మీర్‌కు అసెంబ్లీ ఉన్నా లద్దాఖ్ మాత్రం శాసనసభ లేని కేంద్రపాలిత ప్రాంతంగా కొనసాగుతున్న విషయం తెల్సిందే.

రాజస్థాన్‌లో ఆరేళ్ల బాలికపై అత్యాచారం

జైపూర్ : రాజస్థాన్‌లోని దౌసా జిల్లాలో ఓ వివాహ కార్యక్రమంలో ఆరేళ్ల బాలికపై గుర్తు తెలియని వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడని పోలీసులు శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులు ఫంక్షన్‌కు వెళ్లి ఇంటికి వచ్చిన తర్వాత బాలిక దుస్తులపై రక్తపు మరకలు ఉండడంతో తల్లిదండ్రులు గమనించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. అనంతరం ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారని వారు వివరించారు. ఫిర్యాదు ఆధారంగా దౌసాలోని మహిళా ఠాణాలో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాలికను ఇక్కడి ఆస్పత్రిలో చేర్చారు. నిందితులను గుర్తించి అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

దేశంలో తొలి బుల్లెట్ రైలు స్టేషన్ ఇదే...

వీడియో షేర్ చేసిన కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ముంబై-అహ్మదాబాద్ మధ్య భారతదేశపు మొట్టమొదటి అత్యాధునిక హైస్పీడ్ రైలు కారిడార్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. 2026 నాటికి ఈ ప్రాజెక్ట్ అందుబాటులోకి రానుంది. ఈ క్రమంలో దేశంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ గురించి కీలక సమాచారాన్ని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ తాజాగా పంచుకున్నారు. అహ్మదాబాద్‌లోని సబర్మతి మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్ హబ్‌లో తొలి బుల్లెట్ రైలు కోసం నిర్మించిన రైల్వేస్టేషన్ గ్లింప్స్‌ను ఆయన ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో షేర్ చేశారు. ఈ స్టేషన్‌ని మొత్తం 1,33,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించారు. ఈ హబ్ భవనంలో కార్యాలయాలు, వాణిజ్య కేంద్రాలు, ప్రయాణికుల కోసం రిటైల్ స్టోర్స్ వంటివి ఏర్పాటు చేసుకునే విధంగా నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌లోని ఏకైక అండర్‌గ్రౌండ్ స్టేషన్ ఇదే కావడం విశేషం. దేశంలోని రెండు ఆర్థిక నగరాలను కలుపుతున్న ఈ రైలు మార్గం 508 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. వీటిల్లో 448 కిలోమీటర్ల ప్రయాణం ఎత్తైన కారిడార్‌పై సాగుతుంది. 26 కిలోమీటర్ల మేర సొరంగాలు, 10 కిలోమీటర్ల మేర వంతెనలు, ఏడు కిలోమీటర్లు ఘాట్ మార్గాల్లో ఉంటుంది.

'మిచౌంగ్'ను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-సూళ్లూరుపేట : ఇటీవల ఆంధ్రప్రదేశ్‌ను అతలాకుతలం చేసిన మిచౌంగ్ తుపానును జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం సూళ్లూరుపేట నియోజకవర్గంలో వరద ముంపు ప్రాంతాలను నారాయణ పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... గతంలో ఎన్నడూ లేని విధంగా మిచౌంగ్ తుపాను వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనడంతోపాటు భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో వేలాది ఎకరాల వరి పంట నీట మునిగి కుళ్లిపోయిందని, పంట కుళ్లిపోయిన ప్రతి ఎకరాకు 30 వేల రూపాయలు చొప్పున నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇళ్లల్లోకి వరద నీరు చేరి ఇప్పటికి కూడా తడి ఆరలేదన్నారు. నివాసయోగ్యం కాకుండా జనజీవనం అస్తవ్యస్తమైందని, వారందరినీ సాధారణ పరిస్థితులు ఏర్పడే వరకు పునరావాస కేంద్రాల్లో ఉంచి కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రధానంగా సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని వడ్రపాలెం గ్రామం చుట్టుపక్కల అనధికారికంగా ఏర్పాటుచేసిన అక్రమ లేఅవుట్లే ముంపుకు కారణమని... తక్షణం వారి మీద చర్యలు తీసుకుని సదరు లేఅవుట్లను రద్దు చేయాలన్నారు. అలా జరగని పక్షంలో సీపీఐ అధ్వర్యంలో ప్రజా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కాలంగి నదికి ఇరువైపులా పొర్లు కట్టలు, రివిట్మెంట్ నిర్మించడం ద్వారా పట్టణాన్ని వరదలు ముంచెత్తకుండా కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా వాటర్ పాలెం వాస్తవ్యులు తమ కాలనీ సమీపంలో ఉన్న ప్రేమ సాయి రైస్ మిల్ నుండి వస్తున్న దుమ్ము ధూళి కాలుష్యంతో అనారోగ్యం పాలవుతున్నామని ఆ సమస్య నుండి మాకు రక్షణ కల్పించవలసిందిగా నారాయణకు తెలియజేయగా సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణం సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు, జిల్లా కార్యదర్శి పీ మురళి, సూళ్లూరుపేట నియోజకవర్గ కార్యదర్శి సీ సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు జనమాల గురవయ్య పార్థసారథి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చెంచమ్మ, సీపీఐ సూళ్లూరుపేట నియోజకవర్గ సమితి సభ్యులు నాగేంద్ర, రమణయ్య, ప్రభుదాస్, కే శ్రీనివాసులు, లక్ష్మమ్మ, సీహెచ్ బాలు, ఎం వినోద్, టీ సూర్య, వెంకట కృష్ణయ్య, ఎస్కే కాశీం, వరదయ్యపాలెం సీపీఐ నాయకులు కృష్ణమూర్తి పూర్ణ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌ని చూసి జగన్ మారాలి: రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని చూసైనా ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన వైఖరిలో మార్పు తెచ్చుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో హితవు పలికారు. కేసీఆర్ హయాంలో ప్రగతి భవన్ ఎదుట బారికేడ్లు పెట్టి సామాన్యులను రానిచ్చేవారు కాదని, రేవంత్ రాగానే ఆ బారికేడ్లు తొలగించి, ప్రజా దర్బార్ నిర్వహించి, వినతులు స్వీకరించి, సమస్యలను తెలుసుకున్నారని అన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కూడా మాజీ సీఎం జయలలిత పేరుతోనే అనేక కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. జగన్ ముఖ్యమంత్రి అయిన వెంటనే రూ.9కోట్లతో నిర్మించిన ప్రజావేదికను కూలగొట్టారని, తాడేపల్లిలో ప్యాలెస్ నిర్మించుకుని, సమీపంలో పేదలు లేకుండా చేశారని రామకృష్ణ విమర్శించారు. రెండు ఫర్లాంగుల వరకు పోలీసులతో పహారా కాయిస్తున్నారన్నారు. దాదాపు రూ.10వేల కోట్లతో అభివృద్ధి జరిగిన అమరావతి రాజధాని ప్రాంతాన్ని నిర్వీర్యం చేశారన్నారు. విశాఖ పర్యాటకానికి మణిహారమైన రిషికొండకు బోడిగుండు కొట్టించి, రూ.450 కోట్లు వెచ్చించి ఖరీదైన నివాసాన్ని నిర్మించుకుని ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల నేతలను ఆగర్భశత్రువుల్లా చూస్తూ పోలీసులను ప్రయోగించి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, అభివృద్ధిని అటకెక్కించి రాష్ట్రాన్ని అప్పులమయం చేశారన్నారు. ప్రజా సేవకుడిగా ఉండాల్సిన ముఖ్యమంత్రి నియంతలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలకు, సామాన్యులకు తన వద్ద ప్రవేశం లేకుండా అహంభావం ప్రదర్శిస్తున్నారని జగన్ వైఖరిని రామకృష్ణ దుయ్యబట్టారు. ఇప్పటికైనా మారాలని, ప్రజారంజక పాలన అందించాలని హితవు పలికారు.

రైతులు, కౌలుదారులను గుర్తించి ఆదుకోవాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: అనకాపల్లి జిల్లాలో మిచౌంగ్ తుపాను కారణంగా నష్టపోయిన పంట పొలాలను శుక్రవారం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి అధ్వర్యంలో పార్టీ నేతలు పరిశీలించారు. తుమ్మపాల, బవులు వాడ తదితర గ్రామాల్లో సీపీఐ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మూర్తి వద్ద రైతులు తమ ఆవేదన వెలిబుచ్చారు. తుపాను కారణంగా నష్టపోయిన రైతుల పొలాలను అటు ప్రజా ప్రతినిధులు గాని, అధికారులు గాని పరిశీలించకపోవడం దుర్మార్గమని సత్యనారాయణ మూర్తి మండిపడ్డారు తక్షణమే పరిశీలన చేసి రైతులకు, కౌలుదారులకు సరైన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోవడం వల్ల నిరాశ నిస్పృహలకు గురవుతున్నారని తెలిపారు. రైతులెవరో, కౌలు రైతులెవరో సరైన పరిశీలన చేసి కౌలు రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పంటల నష్టాన్ని అంచనా వేసి సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట నష్టం వివరాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజన దొరబాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు, సీపీఐ రూరల్ కార్యదర్శి చెల్లూరు నాగరాజు, సెక్రెటరీ దేవుడు బాబు, నారాలశెట్టి సత్యనారాయణ, వియ్యాపు రాజు, వేముల కన్నబాబు , పప్పల ఈశ్వరరావు, వియ్యపు రమణ, ఎం.తాతారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తీరని నష్టం

జగన్ పర్యటన కంటితుడుపు మాత్రమే

విశాలాంధ్ర-గూడూరు: తుపాను ప్రభావిత ప్రాంతాలలో సీఎం జగన్ పర్యటన కేవలం కంటితుడుపు చర్య మాత్రమేనని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ విమర్శించారు. శుక్రవారం ఆయన తిరుపతి జిల్లాలోని సూళ్లూరుపేట, కాళహస్తి, చిల్లకూరు మండలాలలో తుపాను ప్రభావిత ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. రైతులతో నేరుగా మాట్లాడారు. అనంతరం సాయంత్రం గూడూరు పట్టణంలోని ఆషిక్ గ్రాండ్ హోటల్ లో మీడియా సమావేశం నిర్వహించారు. జగన్‌మోహన్ రెడ్డి... అధికారంలోకి రాకముందు పాదయాత్ర చేయడం కాదని, ప్రజల కష్ట సుఖాలు తెలుసుకోవాలనుకుంటే మిచౌంగ్ సృష్టించిన బీభత్సాన్ని పాదయాత్ర చేసి తెలుసుకోవాలని అభిప్రాయపడ్డారు. తిరుపతి జిల్లాలో సుమారు 60వేల ఎకరాలలో వరిపైరు కుళ్లిపోయిందన్నారు. జామ, జామాయిల్, సవక, నిమ్మ, మామిడి, బొప్పాయి, అరటితోటలు ధ్వంసమయ్యాయన్నారు. రైతులకు కోలుకోలేని నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎకరానికి 30 వేల రూపాయల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే నాలుగు రోజులుగా వరదనీటిలోనే ఉంటూ సర్వం కోల్పోయిన పేదలకు పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. కొన్ని ప్రాంతాలలో నేటికీ బాధితులకు బియ్యం కూడా పంపిణీ చేయకపోవడం దారుణమన్నారు. వెంటనే ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలలో, శివారు, ముసక ప్రాంతాలలో ఉన్న ప్రజలకు నిత్యావసర వస్తువులు, దుస్తులు యుద్ధ ప్రాతిపదికన అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వాకాడు మండలం బాలిరెడ్డిపాలెంలో జగన్ పర్యటన కనీసం ఆ గ్రామ ప్రజల గోడు వినేందుకు కూడా అవకాశం లేకపోవడం దురదృష్టకరమన్నారు. జగన్ గాలియాత్రలు (ఏరియల్ సర్వే) ఆపి పాదయాత్రలు చేయాలని హితవు పలికారు. నిరంకుశత్వం, అహం ఉంటే అథఃపాతాళానికి దిగజారడం ఖాయమన్నారు. కేసీఆర్ కు పట్టిన గతే జగన్ కూ పడుతుందన్నారు. ప్రమాదవశాత్తు గాయపడిన కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని తెలిపారు.కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, సీపీఐ తిరుపతి, జిల్లా కార్యదర్శులు మురళి, దామా అంకయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్. ప్రభాకర్, జరమాల గురవయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నెల్లూరు జిల్లా కన్వీనర్ షానవాజ్, తిరుపతి జిల్లా నాయకులు సీవీఆర్. కుమార్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జీ శశి కుమార్, చిల్లకూరు మండల కార్యదర్శి గుండాల రమేష్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు చల్లా వెంకటేశ్వర్లు, గీతా భాస్కర్, మురళి, అన్వేష్, సుబ్రమణ్యం, ఇన్సాఫ్ సమితి రాష్ట్ర ఉప కార్యదర్శి షేక్. జమాలుల్లా, ఎన్ఆర్ఐ కార్యదర్శి షేక్. ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క చోటనే ఓటు

డబుల్, నకిలీ ఓట్లకు చెక్: కలెక్టర్లకు ఎస్ఈసీ కీలక ఆదేశాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో డబుల్, నకిలీ ఓట్లకు చెక్ పెట్టేందుకుగాను రాష్ట్ర ప్రధాన ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కీలక ఉత్తర్వుల్ని జారీజేసింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓటర్లకు దాదాపు నాలుగు లక్షల మందికి పైగా హైదరాబాద్, చెన్నయ్, బెంగుళూరులో అదనంగా ఓట్లు ఉన్నట్లు ప్రచారముంది. తెలంగాణ రాష్ట్ర ఎన్నికలు ముగిసిన అనంతరం ఈ అంశం తెరపైకి వచ్చింది. త్వరలో ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తమకు వచ్చిన ఫిర్యాదుల మేరకు డబుల్, నకిలీ ఓట్ల నియంత్రణకు సిద్ధమైంది. ఆయా రాష్ట్రాల్లోని నగరాలు, ప్రాంతాల్లో ఓట్లు వేసిన అభ్యర్థులంతా అక్కడ ఓట్లను రద్దుచేసుకుని, తిరిగి ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే ఎన్నికలకు కొత్తగా నమోదు చేసుకుంటున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఇటీవల ఎస్ఈసీ ముఖేశ్‌కుమార్ మీనాకు రాష్ట్ర మంత్రులు, వైసీపీ నేతలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డబుల్, నకిలీ ఓట్లపై అన్ని జిల్లాల కలెక్టర్లకు ఎస్ఈసీ కీలక ఆదేశాలు జారీజేసింది. ఒక వ్యక్తికి ఒకే నియోజకవర్గం, ఒకే రాష్ట్రంలో ఓటు ఉండాలని, ఒకరికి ఎక్కువ చోట్ల ఓట్లు ఉండటం నిబంధనలకు విరుద్ధమని తేల్చిచెప్పింది. ఫామ్ 6 ద్వారా కొత్త ఓటు నమోదు మాత్రమే చేయాలని, అందుకు ధ్రువీకరణ తీసుకోవాలని సూచించింది. ఇతరచోట్ల తమకు ఓటు లేదని దరఖాస్తుదారులు ధ్రువీకరించాలని, అవాస్తవాల సమాచారం ఇచ్చిన వారిపై కేసులు పెట్టాలని ఆదేశించింది. తప్పుడు ధ్రువీకరణతోఓటు నమోదు చేస్తే జైలు శిక్ష ఉంటుందని తెలిపింది. తప్పుడు సమాచారం ఇచ్చినా, ఓటు నమోదుకు ప్రయత్నించినా పీపుల్స్ యాక్ట్ 1950 సెక్షన్ 31 ప్రకారం సదరు ఓటరు దరఖాస్తు దారులపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించింది. ఈ విషయాన్ని రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలకు ఎస్ఈసీ తెలియజేసింది. 20 సంవత్సరాల పైబడిన వారు ఫామ్ 6 ద్వారా దరఖాస్తు చేస్తే, అధికారులు విచారించి రిమార్క్ ఇవ్వాలని, ఎక్కడ నివాసముంటే అక్కడే ఓ టు హక్కు అని స్పష్టం చేసింది. ఇళ్లు మారే వాళ్లు ఓటుకు ఫామ్ 8 ద్వారా ధ్రువీకరించాలని, తప్పుడుగా ఇస్తే తక్షణమే కేసు నమోదు చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశించింది. క్షేత్రస్థాయిలో అధ్యయనం, పత్రాల పరిశీలన, బూత్ లెవెల్ ఆఫీసర్ల(బీఎల్ఓ) రిమార్కులు, అభ్యంతరాలను పరిగణన అనంతరం తుది నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఏ దరఖాస్తు దారుడైనా తప్పుడు ధ్రువీకరణ, తప్పుడు సమాచారం అందించినట్లు తేలితే వారిపై కేసులు నమోదు చేసి శిక్షలు పడేలా తగిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించింది.

కౌలు రైతులకు నష్టపరిహారం అందించాలి

విశాలాంధ్ర - అమలాపురం: మిచౌంగ్ తుపాను కారణంగా వేలాది రూపాయల పంటల్ని కోల్పోయిన రైతాంగానికి వెంటనే సాయమందించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు దేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి కే సత్తిబాబు నేతృత్వంలో శుక్రవారం నీట మునిగిన పంటచేలను సీపీఐ నాయకులు దేవ రాజేంద్ర ప్రసాద్, పెద్దిరెడ్డి రాము, నిమ్మకాయల శ్రీనివాస్, మోక శ్రీను, గండి రవికుమార్, శీలం వెంకటేష్, వనచర్ల విజయకుమార్ తదితరులతో కలిసి ఆయన పరిశీలించారు. అమలాపురంలో వరి రైతులు వానపల్లి భాస్కరరావు, చింతపల్లి మోహన రావు తమకు జరిగిన నష్టాన్ని నేతలకు వివరించారు. ఎకరానికి రూ.18 నుంచి 20 వేలు పెట్టుబడి, మరో రూ.20 వేలు కౌలు నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని కన్నీటి పర్యంతమయ్యారు. నిబంధనలు మేరకు నష్ట పరిహారం ఇనామ్ దారుడికి చెల్లిస్తున్నారని విపత్కర పరిస్థితుల్లో ప్రత్యేకంగా ప్రభుత్వం చర్యలు తీసుకొని, కౌలు రైతులకు పరిహారం చెల్లించాలని అభ్యర్థించారు. దేగా ప్రభాకర్ మాట్లాడుతూ... కోనసీమ జిల్లాలో వేల ఎకరాలు నీట మునిగిపోయాయని, ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని తేమతో సంబంధం లేకుండా కొనాలన్నారు. ఈ- నమోదు లేనంటువంటి రైతుల వద్ద కూడా ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనాలన్నారు. రైతులకు నష్ట పరిహారం ఎకరానికి రూ.50 వేలు చెల్లిస్తేనే రైతులు తిరిగి సాగు చేయగలరని అన్నారు. తుపాను ముప్పును కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రైతులను తక్షణమే ఆదుకోవాలి

- చంద్రబాబునాయుడు
- బాపట్ల జిల్లాలో నీటమునిగిన పంట పొలాల పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో- బాపట్ల: మిచౌంగ్ తుపాను కారణంగా డెల్టా ప్రాంతంలో తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు డిమాండ్ చేశారు. జిల్లాలోని వేమూరు, రేపల్లె బాపట్ల నియోజకవర్గాల్లో చంద్రబాబు పర్యటించారు. దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించి రైతులను నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. చేతికందివచ్చిన పంట నీట మునిగి అన్నదాతలు బాధలో ఉంటే ఇంత వరకు ఏ ఒక్క అధికారి పంట నష్టాన్ని పరిశీలించకపోవడం దారుణం అన్నారు. గత నాలుగేళ్లుగా డ్రైనేజీ కాలువలు తీయించకపోవడం వల్లే వర్షం తగ్గి నాలుగు రోజులైనా పంట పొలాల్లో మురుగు అలానే ఉండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టిసీమ ద్వారా సకాలంలో సాగునీరు అందిస్తే రైతులకు 10 రోజులు ముందుగానే పంటలు చేతికొచ్చేవని, అవగాహన లేని, మూర్ఖత్వంతో కూడిన ముఖ్యమంత్రి సాగు నీరు అందించే విషయంలో ఆలస్యం చేయడం వల్ల రైతులు నష్టపోయారని విమర్శించారు. బంగాళదుంపకు, ఉల్లిగడ్డకు తేడా తెలియని ముఖ్యమంత్రి మన ముఖ్యమంత్రి అని ఎద్దేవా చేశారు. పదిరోజుల ముందుగానే తుపాను హెచ్చరికలు వచ్చినా... ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైం దన్నారు. గతంలో హుదూద్ తుపాను వచ్చిన సమయంలో ముందే విశాఖ వెళ్లి దగ్గరుండి నష్టాన్ని అరికట్టానని గుర్తు చేశారు. నష్టాన్ని పరిశీలించేందుకు నేటి వరకు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల్ని ఆహ్వానించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. బాధ్యతలేని ముఖ్యమంత్రి, బాధ్యత లేని ప్రభుత్వం ఉండటం వల్లే ఇంత నష్టం జరిగిందని చంద్రబాబు పేర్కొన్నారు.స్థానిక మంత్రులు సాధికార యాత్రలో తిరుగుతూ నియోజకవర్గ ప్రజలను రైతాంగాన్ని వదిలేశారని విమర్శించారు. రాష్ట్రంలో పరిపాలన పూర్తిగా గాడి తప్పిందని కేవలం కక్ష సాధింపులు, అరాచకాలు జరుగుతున్నాయన్నారు. గాడి తప్పిన పరిపాలనను తిరిగి గాడిలో పెట్టేందుకు తెలుగుదేశం జనసేన పార్టీల ఆధ్వర్యంలో ఏర్పడే ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు నక్కా ఆనంద్ బాబు, కన్నా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, తాడికొండ మాజీ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, వేమూరు నియోజకవర్గం సమన్వయకర్త ఉసా రాజేష్ తదితరులు పాల్గొన్నారు

నేను రాజ్యాంగ సేవకుడిని

సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ స్పష్టీకరణ

న్యూదిల్లీ: ఓ న్యాయమూర్తిగా... చట్టం, రాజ్యాంగానికి తాను ఓ సేవకుడినని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. నిర్దేశించిన స్థాయిని తాను అనుసరించాల్సి ఉంటుందని చెప్పారు. కొలీజియం వ్యవస్థలో సంస్కరణలు అవసరమనే అంశాన్ని ధర్మాసనం దృష్టికి ఓ న్యాయవాది తీసుకురాగా...దానిపై సీజేఐ స్పందించారు. సుప్రీంకోర్టులో శుక్రవారం రోజువారీ కార్యకలాపాలు ప్రారంభం కాగానే సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం సమావేశమైంది. ఇదే సమయంలో మాథ్యూస్ జె.నెడుంపారా అనే న్యాయవాది కోర్టు ముందు ఓ అంశాన్ని ప్రస్తావించారు. కొలీజియం వ్యవస్థలో సంస్కరణల అవసరంతోపాటు సీనియర్ న్యాయవాది హోదా రద్దు వంటి అంశాలను ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై సుప్రీం ధర్మాసనం స్పందిస్తూ 'మీ మనసుకు నచ్చిన అంశాన్ని చెప్పే స్వేచ్ఛ మీకు ఉంది. భారత ప్రధాన న్యాయమూర్తిగా, ముఖ్యంగా ఓ న్యాయమూర్తిగా మొదట నేను చట్టం, రాజ్యాంగానికి సేవకుడిని. నిర్దేశించిన స్థాయిని అనుసరించాల్సి ఉంటుంది. నాకు ఇది నచ్చింది, నేను ఇది చేస్తాను అని చెప్పలేను' అని జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే, న్యాయవాదుల్లో కొందరికి సీనియర్ న్యాయవాది హోదా ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ నెడుంపారా దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని గతేడాది అక్టోబర్‌లోనే సుప్రీంకోర్టు కొట్టివేసింది. అడ్వొకేట్స్ చట్టం-1961లోని నిబంధనల ప్రకారం సీనియర్ న్యాయవాది హోదాకు రాజ్యాంగబద్ధత ఉందని తెలిపింది. సీనియర్ న్యాయవాది హోదాను ఇచ్చే యంత్రాంగం ఏకపక్షంగా కృత్రిమంగా లేదని, ప్రతిభ ఆధారిత ప్రక్రియ అని స్పష్టం చేసింది.

అన్ని దానాల్లో రక్తదానం మిన్న

వీఐటీ ఉపకులపతి ఎస్వీ కోటారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అన్ని దానాల్లో రక్తదానం గొప్పదని వీఐటీ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఎస్వీ కోటారెడ్డి అన్నారు. వీఐటీ వ్యవస్థాపకులు, ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ 85వ జన్మదిన వేడుకలను పురస్క రించుకుని శుక్రవారం వీఐటీ యూనివర్శిటీలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వీసీ కోటారెడ్డి, గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్ కుమార్‌లు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు రక్తదానం ప్రాముఖ్య తను తెలియజేశారు. రక్తదానం పట్ల ప్రజల్లో ఉన్న అపోహలపై వివరణ ఇచ్చారు. ఆపదలో ఉన్న వ్యక్తికి రక్తదానం చేయడం మానవతా విధి అని, దీనిపై విద్యార్థులు ప్రజలను చైతన్య వంతులను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని రక్తదానంచేసారు. యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ ముదిగంటి, డాక్టర్ ఖదీర్ బాషా, సురేష్‌కుమార్, హెచ్‌డీఎఫ్‌సీ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ ఇంద్రకంటి సత్యనారాయణ శర్మ తదితరులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. అనంతరం వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం దత్తత తీసుకున్న గ్రామాలలోని పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, జామెట్రీ బాక్స్, ఎక్స్‌ప్యాడ్స్‌ను పంపిణీ చేశారు.

మంగంపేట ముగ్గురాయి గనిలో అక్రమాలు

సిట్టింగ్ జడ్జితో విచారణకు ఈశ్వరయ్య డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: అన్నమయ్య జిల్లా కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం మంగంపేట ముగ్గురాయి గనిలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య శుక్రవారం లేఖ రాశారు. మంగంపేట ముగ్గురాయి(బైరటీస్) నిక్షేపాలు ప్రపంచంలోనే అత్యంత నాణ్యమైనవని, ఇక్కడి నుండి 30 దేశాలకు ఎగుమతి అవుతుందని తెలిపారు. నాణ్యమైన ముగ్గురాయిని కొందరు ఏపీఎండీసీ అధికారులు వైసీపీ నేతలు దేవకుమార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, సుందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి కుమ్మక్కై దోచుకుంటున్నారని ఈశ్వరయ్య తెలిపారు. పట్టుబడిన కాంట్రాక్టర్లు, దొంగతనానికి సహకరించిన ఏపీఎండీసీ ఉద్యోగులు డి.శివప్రసాద్, యు.రాజేశ్, కె.గోవర్ధన్‌రెడ్డి, పి.ప్రసాద్‌రెడ్డి, రాజారెడ్డి, కె.రామాంజనేయులు పట్టుబడినా...అధికారం అండతో కేసును మాఫీ చేసుకున్నారని ఆరోపించారు. ఏపీఎండీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వెంకటరెడ్డి గనిలో గల ముగ్గురాయి ఏ-గ్రేడు, బీ- గ్రేడ్, సీ-గ్రేడ్, డీ- గ్రేడ్‌ను కలిపి ఒకేసారి బ్లాస్టింగ్ చేయడం, వాటిని వేర్వేరుగా కాకుండా కొన్ని గ్రేడులను డంపు చేసి...తనకు అనుకూలమైన కాంట్రాక్టర్లకు ఇచ్చి...కోట్లు దోచుకుంటున్నారన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ బంధువుకు లక్షల టన్నులు కట్టబెడుతున్నట్లు వివరించారు.

మరోవైపు డేంజర్ జోన్ ప్రకటించి రెండు దశాబ్దాలు గడుస్తున్నా బాధితులకు పరిహారం చెల్లించకుండా కంపచెట్లలో, పంట పొలాలలో నివాసాలకు పనికిరాని ఫంక్షన్ హాల్, కల్యాణ మండపాలు నాసిరకంగా నిర్మించి కోట్ల రూపాయలు సంపాదించుకున్నారని ఈశ్వరయ్య తెలిపారు. ఇందుకోసం కిందిస్థాయి రెవెన్యూ అధికారుల నుంచి జిల్లాస్థాయి అధికారుల వరకు లక్షలాది రూపాయల ముడుపులు తీసుకుంటున్నారని చెప్పారు. డేంజర్ జోన్ ప్రకటించినప్పుడు 100 ఇళ్లు ఉంటే నేడు అవి 600 ఇళ్లకు పెరిగాయన్నారు. పునరావాసం కోసం చూపించే స్థలం అభివృద్ధి పేరుతో సుబ్బారెడ్డి అనే బడా కాంట్రాక్టర్‌కు అప్పజెప్పి... అతని ద్వారా దేవకుమార్ రెడ్డి, హరినాథ్‌రెడ్డి, స్థానిక పార్లమెంటు సభ్యుడు మిథున్‌రెడ్డి వాటాలు పంచుకుంటున్నారని వివరించారు. వెంకటరెడ్డి వచ్చాక అధికార పార్టీ నాయకులు విచ్చలవిడిగా ఇసుక తవ్వేసుకుంటున్నారని తెలిపారు. ఈ ఏడాది మే 13వ తేదీన జేపీ వెంచర్స్ కాంట్రాక్ట్ ముగిసినప్పటికీ...ఆ విషయం బయటపడకుండా అధికార పార్టీ నేతలు ఇసుక దోచుకుంటున్నారని విమర్శించారు. వెంకటరెడ్డి అవినీతి పరాకాష్ఠకు చేరుకుందన్నారు. మంగంపేట బైరటీస్ సంస్థలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

అంగన్‌వాడీలకు న్యాయమెప్పుడు?

బీహార్ ప్రభుత్వానికి పది కార్మిక సంఘాల ఐక్యవేదిక

న్యూదిల్లీ: బీహార్‌లో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సెప్టెంబరు 29న సమ్మెబాట పట్టారు. అప్పటి నుంచి సమ్మె కొన సాగిస్తూ న్యాయమైన హక్కుల పరిష్కారానికి డిమాండ్ చేస్తున్నారు. కానీ నితీశ్ కుమార్ వారిని పట్టించుకోకుండా లేదు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదు. దీనిపై పది కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆందోళన వ్యక్తంచేసింది. నితీశ్ కుమార్ ప్రభుత్వానికి శుక్రవారం ఓ లేఖ రాసింది. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఇందు కోసం కార్మిక సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (జేపీసీ)తో చర్చలు జరపాలని సూచించింది. కేంద్ర ప్రభుత్వం వలే వ్యవహరించకుండా కార్మికులకు న్యాయం చేయాలని కోరింది. కార్మిక సంస్కరణల పేరిట కేంద్రం తీసుకొచ్చిన నాలుగు కోడ్‌ల అమలునకు చర్యలు తీసు కోవద్దని నితీశ్ ప్రభుత్వానికి ఐక్యవేదిక విజ్ఞప్తి చేసింది. కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజలు, రైతులు, కార్మికులు, జాతి వ్యతిరేక చర్యలపై తమ పోరు కొనసాగుతోందని ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, ఎస్ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీ సంఘాలతో కూడుకున్న ఐక్యవేదిక నొక్కిచెప్పింది.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

వినయ్ విశ్వం లేఖ

బీహార్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని నితీశ్ కుమార్‌కు సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం ఓ లేఖలో కోరారు. 'ఒక్కరోజులో 1.20లక్షల మంది టీచర్లకు ఉద్యోగాలిచ్చి బీహార్ ఆదర్శంగా నిలిచింది కానీ కొందరు అధికారులు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. ఆయా చర్యలను అప్రజాస్వామికమైనవిగా టీచర్లు పరిగణిస్తు న్నారు. విద్యాశాఖ సీనియర్ అధికారి క్రమంగా అప్రజా స్వామిక ఉత్తర్వులతో టీచర్ల హక్కులను హరిస్తున్నారు. సంఘాలు ఏర్పాటు చేసుకోవద్దని, అభిప్రాయాలు వ్యక్తం చేయొద్దని, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టవ ద్దంటూ వారి భావ వ్యక్తీకరణ హక్కును హరిస్తున్నారు. ఇవన్నీ కార్మిక సంఘాలకు విరుద్ధమైన ఉత్తర్వులు. వీటిని నిరసిస్తూ టీచర్లు ఆందోళన కూడా చేశారు. కాబట్టి ఈ వ్యవహారంలో మీరు జోక్యం చేసుకొని టీచర్లకు అప్రజాస్వామిక ఉత్తర్వులు ఇచ్చే అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నా' అని నితీశ్‌కు లేఖలో వినయ్ విశ్వం పేర్కొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.